బుధవారం
13-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 171
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఫిబ్రవరిలో సీబీఎస్‌ఈ 10, 12 పరీక్షలు

న్యూఢిల్లీ: సీబీఎస్‌ఈ 10, 12 తరగతుల పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి మార్చి 13వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయి. అలాగే ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2 వరకు 12వ తరగతి పరీక్షలు జరుగుతాయని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ప్రకటించింది.

రోజు ఉదయం 10.30 గంటలకు పరీక్షలు మొదలవుతాయని తెలిపింది. జేఈఈ వంటి పోటీ పరీక్షల దృష్ట్యా షెడ్యూల్ రూపొందించినట్లు పరీక్షల కంట్రోలర్ డా.సన్యం భరద్వాజ్ వెల్లడించారు.

ప్రతి గింజా కొనుగోలు

- సంక్రాంతిలోగా ఇన్‌పుట్ సబ్సిడీ
- ఆర్బీకేలకు బాధ్యత
- రైతు సోదరుల్లో భరోసా నింపాలి
- సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- ఎన్యూమరేషన్ ప్రక్రియపై ఆరా
- రంగు మారిన, తడిసిన ధాన్యం కొనుగోలుపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని పౌర సరఫరాల సంస్థ కొనుగోలు చేస్తోందని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రతి గింజనూ కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని, ఇదే విషయాన్ని రైతు సోదరులందరికీ తెలియజేసి, వారిలో భరోసాను నింపాలని ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి ఆదేశించారు. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలపై, రంగు మారిన ధాన్యం కొనుగోలుపై తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సీఎం జగన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. తుపాను బాధిత ప్రాంతాల్లో రైతులను ఆదుకునేందుకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకుంటుందన్న భరోసా వారిలో కల్పించాలని ఎమ్మెల్యేలను సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించి అయినా

- మిగతా 2 లో

అలకలు... రాజీనామాలు

- కొత్త ఇన్‌చార్జిల నియామకాలతో నిరసనలు
- మోపిదేవి అనుచరులు 150 మంది రాజీనామా
- అదేబాటలో ఆర్కే మద్దతుదారులు
- విశాఖలోనూ తప్పని తిప్పలు

అమరావతి/విశాఖ బ్యూరో-విశాలాంధ్ర: అధికార వైసీపీలో అసమ్మతి జ్వాల రగులుతోంది. అలకలు, రాజీనామా పర్వం కొనసాగుతోంది. పార్టీ అధిష్ఠానంపై ధిక్కారస్వరాలు పెరుగుతున్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం అంటూ వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇష్టానుసారం అభ్యర్థులను మారుస్తున్నారు. నిన్ననే 11 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు. మంత్రులకు సైతం స్థానచలనం తప్పలేదు. కొన్నిచోట్ల ఇప్పటికే ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్న నాయకులను తొలగించి కొత్తవారిని నియమించడంతో అలకలు, రాజీనామాలు పెరిగాయి.

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మార్పు అక్కడ చిచ్చు రేపింది. రాజ్యసభ ఎంపీ మోపిదేవి వెంకటరమణ స్థానంలో డాక్టర్ ఈవూరు గణేశ్‌ను ఇన్‌చార్జిగా వైసీపీ ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని రేపల్లె వైసీపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. మోపిదేవి వెంకటరమణకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. మోపిదేవి వెంకటరమణ 14 ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి పనిచేస్తున్నారని, ఆయనను పక్కన పెట్టి గణేశ్‌ను ఇన్‌చార్జిగా నియమించడం బాధాకరమని నేతలు అన్నారు. రేపల్లెలోని వైసీపీ కార్యాలయంలో ముఖ్యనేతలు సమావేశమై...మోపిదేవికి మద్దతుగా వివిధ పదవుల్లో ఉన్న 150 మంది రాజీనామా చేశారు. ఇన్‌చార్జి మార్పు నిర్ణయాన్ని వైసీపీ అధిష్ఠానం పునఃసమీక్షించాలని కోరారు. రాజీనామా చేసిన వారిలో మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్‌లు, రేపల్లె, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల కీలక నేతలు ఉన్నారు. మంగళగిరిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వైసీపీకి, ఎమ్మెల్యే పదవికి ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రాజీనామా చేయడం, మంగళగిరి ఇన్‌చార్జిగా చేనేత నాయకుడు గంజి చిరంజీవిని నియమించడం చకచకా జరిగిపోయాయి. గంజి చిరంజీవి నియామకంపై ఆర్కే ముఖ్య అనుచరులు రగిలిపోతున్నారు. మంచి నాయకుడిగా, మృదుస్వభావిగా, పార్టీకి అత్యంత విశ్వాసపాత్రుడిగా ఉన్న ఆర్కేను తప్పించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. చాలామంది నాయకులు రాజీనామాకు సిద్ధపడ్డారు. ఆర్కే మాత్రం ఎవరికీ అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం ఫోన్లకు కూడా

- మిగతా 2 లో

ప్రభుత్వ కార్యాలయాల తరలింపుపై స్పష్టత ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అమరావతి రాజధాని ప్రాంతం నుంచి విశాఖకు ప్రభుత్వ కార్యాలయాల తరలింపుపై స్పష్టత ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కేసును 18వ తేదీకి వాయిదా వేసింది.

విశాఖకు ప్రభుత్వ కార్యాలయాల తరలింపును నిలిపివేయాలని కోరుతూ రాజధాని పరిరక్షణ సమితి హైకోర్టులో ఇటీవల పిటిషన్ వేసింది. దానిపై మంగళవారం వాదనలు కొనసాగాయి. క్యాంపు కార్యాలయం ముసుగులో ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారని రాజధాని పరిరక్షణ సమితి తరపున న్యాయవాదులు పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం తరపున న్యాయవాది వాదనలు వినిపించి, ఈ పిటిషన్‌ను త్రిసభ్య ధర్మాసనం ముందుకు పంపాలని కోరారు. ఈ మేరకు రిజిస్ట్రీలో దరఖాస్తు ఇచ్చినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమయంలో రాజధాని పరిరక్షణ సమితి న్యాయవాదులు న్యాయమూర్తి దృష్టికి ప్రభుత్వ కార్యాలయాల తరలింపుపై ముందు స్పష్టత ఇవ్వాలని కోరారు. దానిపై ప్రభుత్వ న్యాయవాదిని న్యాయమూర్తి అడుగగా, ఇప్పుడే కార్యాలయాలను తరలించడం లేదని కోర్టుకు వివరించారు.

ఇటీవల ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరుతో వివిధ క్యాంపు కార్యాలయాలను తరలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీజేసిన

- మిగతా 2 లో

ఏపీ కేబినెట్ 15కు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ కేబినెట్ సమావేశాన్ని ఈనెల 15వ తేదీకి మార్పు చేశారు. తొలుత 14వ తేదీన నిర్వహించాలని భావించినప్పటికీ, అనివార్య కారణాలవల్ల 15వ తేదీకి మార్చారు. సీఎం జగన్ అధ్యక్షతన జరిగే కేబినెట్ సమావేశానికి ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు అందరూ మంత్రివర్గ సమావేశంలో ఉంచే ప్రతిపాదనలను ఈనెల 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. తుపాను కారణంగా నష్టపోయిన ఆ రైతులకు పంట నష్టం అంచనాలపైన కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉంది. ఉద్యోగాలకు వయోపరిమితి పెంపు అంశం పైన, డీఎస్సీ పోస్టుల ప్రకటన పైన ఈ కేబినెట్ సమావేశంలో స్పష్టత వస్తుందని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

వినుకొండ సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ఆందోళనలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్
- 257 ప్రాజెక్టు కార్యాలయాల ముందు ఆందోళనలు
- మూతపడిన 55,600 అంగన్‌వాడీ కేంద్రాలు

విశాలాంధ్ర-విజయవాడ: తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ), ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ), ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) సంయుక్త అధ్వర్యంలో రాష్ట్రంలోని 257 ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ఆందోళనలు జరిగాయి. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు మొత్తం లక్షా ఆరువేల మంది సమ్మెలో పాల్గొన్నారు. కృష్ణా జిల్లా కానూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఎన్నికల ముందు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచుతానని హామీ ఇచ్చిన సీఎం జగన్...అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవటం లేదని విమర్శించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని 2022లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. హెల్పర్లకు పదోన్నతికి సంబంధించి ఎటువంటి

- మిగతా 2 లో

జగన్‌కు కేసీఆర్ గతే

- అహంకార, అవినీతి పాలనను ప్రజలు సహించరు
- పంజరంలో చిలుక...న్యాయవ్యవస్థ
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి నియంతృత్వ ధోరణితో పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని సీపీఐ జాతీయ కార్యదర్శి డా కె.నారాయణ స్పష్టంచేశారు. తిరుపతి గంధమనేని శివయ్య భవనంలో నారాయణ మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ అధికారం చేపట్టాక జగన్‌కు పొగరు, అహంకారం పెరిగాయని, అవినీతి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. జగన్‌లో ఏ కోశాన పాలనాదక్షత కనిపించడం లేదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాచి...బాధ్యతలు విస్మరించి రాక్షస పాలన సాగిస్తున్న జగన్‌కు ప్రజలు సరైన సమయంలో గుణపాఠం చెప్పడానికి సిద్ధమయ్యారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చినంత మాత్రాన జగన్‌కి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పంటల మునక సంగతి పక్కన పెట్టండి. ఇప్పుడు మన ప్రభుత్వం మీకోసం ఏమేం పథకాలు ఇచ్చిందో ఒకసారి ఏకరువు పెడతా!

రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ

ఉపముఖ్యమంత్రులుగా దియాకుమారి, బైర్వా

జైపూర్: బీజేపీ కేంద్ర నాయకత్వం ఎట్టకేలకు రాజస్థాన్ ముఖ్యమంత్రిని ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రుల ఎంపికలో కొత్త ముఖాలకు అవకాశమిచ్చిన బీజేపీ... రాజస్థాన్ లోనూ అదే సంప్రదాయం పాటించింది. రాజస్థాన్ విషయానికి వస్తే... అనూహ్యంగా తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నేతకు సీఎం పగ్గాలు అప్పగిస్తూ కీలక నిర్ణయం

- మిగతా 2 లో

వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ భూతం

- విద్యార్థులకు భద్రత కరువు
- సీనియర్ల వికృత చేష్టలకు జూనియర్లు బలి
- ఫిర్యాదులు అందినా సర్కారు మౌనం
- ఎంసీఐ ఆదేశించినా చర్యలకు యాజమాన్యాలు వెనకడుగు
- నిర్వహణ అస్తవ్యస్తం
- లోపించిన ప్రభుత్వ పర్యవేక్షణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య కళాశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. విద్యార్థులకు భద్రత కరువైంది. కొంత కాలంగా, రాష్ట్రంలోని అనేక వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ జరుగుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందినా ఇంతవరకు స్పందన లేదు. కర్నూలు, ఒంగోలు, విజయవాడ సహా ఇతర ప్రాంతాల్లోని వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ బారిన పడిన బాధిత విద్యార్థులు కళాశాలల యాజమాన్యం, ప్రిన్సిపాళ్లకు ఫిర్యాదు చేసినప్పటికీ, చర్యలకు యాజమాన్యం వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఆయా మెడికల్ కళాశాలల్లో చేరిన జూనియర్ విద్యార్థులతో సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నట్లు పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. మెడికల్ కళాశాలల్లో చేరిన జూనియర్లతో కొందరు సీనియర్లకు చెందిన రికార్డులను బలవంతంగా రాయిస్తున్నారు. దీంతో జూనియర్ డాక్టర్లు తమ రికార్డులతోపాటు సీనియర్ రికార్డులను అదనంగా రాయడం వల్ల నిద్రలేని రాత్రులు

- మిగతా 2 లో

కార్మిక- ప్రజాందోళన పున:నిర్మాణమే లక్ష్యం

సైప్రస్: 'సైప్రస్ కమ్యూనిస్టు ఇనిషియేటివ్' లాంఛనంగా ప్రారంభమైంది. సుత్తి-కొడవలి గుర్తుతో వర్కర్స్, పీపుల్స్ మూవ్‌మెంట్ పున:నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. సైప్రాట్ సమాజంలో ఏళ్ల తరబడిగా ఏర్పడిన రాజకీయ శూన్యతను భర్తీ చేయడమే దీని లక్ష్యం. అదే సమయంలో కార్మిక వర్గం, ప్రజల తరపున పోరాటాలకు చోదకశక్తి కావాలన్నదే సంకల్పం. డిసెంబరు 2న ఈ సంఘం ఏర్పాటు అయింది. 8న బోర్డు సభ్యులు నియమితులయ్యారు. కార్యదర్శిగా క్రిస్టోస్ కౌర్టోల్లారిస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా లియాండ్రోస్ సావిడిస్, ప్రధాన కార్యదర్శిగా మారియోస్ లావోన్నో, కోశాధికారిగా ఆండ్రీ లౌకా, సభ్యులుగా అలెక్సిస్ ఆంటోనియో, క్రిశాంతి ఎపిఫానియో, నికోలాస్, యన్నిస్ సక్రోటాస్, మారియా సక్రోటౌస్ ఉన్నారు.

16న హద్దాష్ జాతీయ సదస్సు

అడ్డుకునే యత్నాల్లో ఇజ్రాయిల్ పోలీసులు

టెల్అవీవ్: హద్దాష్ జాతీయ సదస్సు ఈనెల 16న జరగనుంది. దానిని జరగనివ్వకుండా అడ్డుకునేందుకు ఇజ్రాయిల్ పోలీసులు యత్నిస్తున్నారు. ఈ సదస్సు జరిగితే ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు ఉంటాయని, ఇది ప్రజా శ్రేయస్సుకు హానికరమని పోలీసులు చెబుతున్నారు. ఉత్తర ఇజ్రాయిల్‌లోని షెఫార్మ్ నగరంలో ఈ సదస్సు జరగబోయే స్థలం యజమానిని పోలీసులు బెదిరిస్తున్నట్లు హద్దాష్ ప్రధాన కార్యదర్శి అంజద్ వెల్లడించారు. గాజాపై దురాక్రమణ కొనసాగింపునకు వ్యతిరేకంగా రాజకీయ చర్యలే అజెండాగా తెలిపారు. హద్దాష్ (డెమొక్రటిక్ ఫ్రంట్ ఫర్ పీస్ అండ్ ఈక్వాలిటీ), ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పొలిట్ బ్యూరోలు సమావేశమై తాజా పరిణామాలపై నిశితంగా చర్చించినట్లు వెల్లడించారు. సదస్సు జరగబోయే స్థలం యజమానిని బెదిరించారని, కార్యక్రమం జరిగితే నెల పాటు దానిని మూసివేస్తామని హెచ్చరించారని తెలిసింది. ఏదిఏమైనా వెనక్కి తగ్గకుండా నిర్దేశిత తేదీన సదస్సు జరిగాలని, దీనిని జయప్రదం చేయాలని యూదులు, అరబ్ ప్రగతిశీల దళాలు, అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక శక్తులకు హద్దాష్, సీపీఐ పిలుపునిచ్చాయి.

పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

సైనిక స్థావరమే లక్ష్యం

23 మంది దుర్మరణం

పెషావర్: పాకిస్థాన్‌లో మంగళవారం ఆత్మాహుతి దాడి జరిగింది. సైనిక స్థావరమే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో 23 మంది దుర్మరణం చెందారు. మరో 27 మందికి గాయాలయ్యాయి. అఫ్గాన్ సరిహద్దు వద్ద ఖైబర్ పఖ్‌తుంఖ్వా ప్రావిన్స్, దేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని స్థావరంపై తెల్లవారుజామున దాడి జరిగినట్లు ఓ అధికారి తెలిపారు. పాకిస్థానీ తాలిబన్లు ఈ దాడికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. నిద్రలోనే అనేక మంది మృత్యువాత పడ్డారని, వారు సాధారణ వస్త్రధారణలో ఉండటంతో చనిపోయిన వారందరూ సైనికులేనా అన్నది తేలాల్సి ఉందన్నారు. తాత్కాలిక స్థావరంగా స్కూలు భవనం వినియోగమవుతున్న క్రమంలో దాని వద్ద ఆయుధాలతో నిలిపిన వాహనంలో ఆత్మాహుతి దాడి జరిగిందని, పేలుడు ధాటికి మూడు గదులు కూలిపోగా శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికితీస్తున్నట్లు అధికారి వెల్లడించారు. మృతుల సంఖ్య పెరగవచ్చన్నారు. అర్ధరాత్రి 2.30 గంటలకు ఒకడు ఆత్మాహుతికి పాల్పడగా మిగతా వారు లోపలికి చొరబడినట్లు పాకిస్థాన్ తాలిబన్ అనుబంధ కొత్త సంస్థ 'తారీకే జిహాద్ పాకిస్థాన్' పేర్కొంది. ఈ ఘటనపై పాకిస్థాన్ సైన్యం ఇంకా స్పందించలేదు. 2021లో అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సరిహద్దు ప్రాంతాల్లో నాటకీయంగా ఉగ్రవాద దాడులు జరుగుతూనే ఉన్నాయి.

విశాలాంధ్ర ప్రపంచం

నేడు కర్నూలుకు కేంద్ర 'కరువు' బృందాలు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: వర్షాభావ పరిస్థితులతో కర్నూలు జిల్లాలో కరువు తాండవిస్తోంది. దీంతో కరువు మండలాల్లో పరిస్థితులు పరిశీలించేందుకు కేంద్ర బృందాలు బుధవారం కర్నూలులో పర్యటించనున్నాయి.

ఈనెల 13,14 తేదీలలో జిల్లాలోని 24 మండలాల్లో కరువు బృందాలు పర్యటిస్తాయి. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను, వలసలు, వర్షాభావ పరిస్థితుల కారణంగా జరిగిన పంట నష్టం వంటివి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాయి. ఈ ఏడాది వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు వలసబాట పట్టారు. కోసిగి, కౌతాళం, పత్తికొండ, ఆలూరు, కోడుమూరు, తుగ్గలి, క్రిష్ణగిరి, డోన్, ప్యాపిలి, మద్దికెర తదితర మండలాల ప్రజలు వలస వెళ్లారు.

52వేల కుటుంబాలకుపైగా వలస వెళ్లినట్లు సమాచారం. ఖరీఫ్‌లో వేసిన పంటలు నిలువునా ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. కర్నూలు జిల్లాలో 24 మండలాలను, నంద్యాల జిల్లాలో 6 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించగా ఈ జాబితాలో తుగ్గలి, క్రిష్ణగిరి, కర్నూలు రూరల్‌ను చేర్చాలని సీపీఐ, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. కరువుకు శాశ్వత పరిష్కారం కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ రైతులు తీవ్రంగా నష్టపోయారని, వీరికి నష్టపరిహారం చెల్లించాలని, బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, ఉచితంగా ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలని, ముఖ్యంగా గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ కాలువలు పూర్తి చేస్తే వలసలను నివారించవచ్చని ప్రభుత్వానికి రైతు నాయకులు సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల తరలింపుపై స్పష్టత ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

విషయం విదితమే. దానికి సంబంధించి విశాఖ, రుషికొండ పరిసర ప్రాంతాల్లో క్యాంపు కార్యాలయాల ఏర్పాటులో ప్రభుత్వం నిమగ్నమైంది. క్యాంపు కార్యాలయాల పేరుతో పూర్తిగా ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారని, తక్షణమే వాటి నిలుపుదల చేయాలంటూ రాజధాని పరిరక్షణ సమితి హైకోర్టులో కేసు వేయడంతో ఈ అంశం తెరపైకి వచ్చింది.

రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంది. రాజస్థాన్ నూతన ముఖ్యమంత్రిగా భజన్‌లాల్ శర్మను ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో శర్మను శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ అధిష్ఠానం పరిశీలకులుగా వచ్చిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, వినోద్ తావ్డే, సరోజ్ పాండే సమక్షంలో 115 మంది కొత్త ఎమ్మెల్యేలు ఇక్కడ సమావేశమయ్యారు. భజన్‌లాల్‌తో పాటు ఇద్దరు ఉపముఖ్యమంత్రులను కూడా ప్రకటించారు. దియాసింగ్ కుమారి, ప్రేమ్‌చంద్ బైర్వా డిప్యూటీ సీఎంలుగా బాధ్యతలు చేపట్టనున్నారు. వాసుదేవ్ దేవనానిని స్పీకర్‌గా ఎంపిక చేశారు. ఈ వివరాలను రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు. భజన్‌లాల్ పేరును మాజీ సీఎం వసుంధర రాజె ప్రతిపాదించారు. కాగా, బ్రాహ్మణ వర్గానికి చెందిన భజన్‌లాల్ శర్మ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. నాలుగుసార్లు ఆయన ఈ పదవి చేపట్టారు. ఇప్పటివరకు పార్టీలో సంస్థాగతంగా కీలకంగా వ్యవహరించిన భజన్‌లాల్... ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. సంగనేర్ నుంచి పోటీ చేసిన ఆయన... తన సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై 48 వేల ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. ఆయన అసెంబ్లీకి ఎన్నికవ్వడం ఇదే తొలిసారి. భజన్‌లాల్‌కు ఆర్ఎస్ఎస్‌తో మంచి అనుబంధం ఉంది. గతంలో ఏబీవీపీ నేతగా వ్యవహరించారు. 56 ఏళ్ల భజన్‌లాల్ పీజీ పూర్తి చేశారు.

గవర్నరును కలిసిన భజన్‌లాల్

బీజేపీ శాసనసభాపక్ష సమావేశం అనంతరం ముఖ్యమంత్రిగా ఎంపికైన భజన్‌లాల్ శర్మ గవర్నరు కల్‌రాజ్ మిశ్రాను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. శర్మను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నామని తెలుపుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషి గవర్నరు లేఖ అందజేశారు. శర్మ వెంట రాజ్‌నాథ్‌సింగ్, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, మాజీ సీఎం వసుంధరరాజె, ఉపముఖ్యమంత్రులుగా ఎంపికైన దియాకుమారి, ప్రేమ్‌చంద్ బైర్వా ఉన్నారు. 115 మంది ఎమ్మెల్యేల జాబితాను గవర్నరుకు అందజేశారు.

గాజాలో ఆకలి కేకలు

ఆగని బాంబుల వర్షం - 18,205కు పెరిగిన మృతులు

కైరో/ఐరాస: ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు, ట్యాంకర్లు దక్షిణ గాజాలో మంగళవారం భీకర దాడులు చేశాయి. ఇజ్రాయిల్-హమాస్ మధ్య రెండు నెలలకుపైగా పోరు సాగుతోంది. రోజురోజుకు క్షేత్రస్థాయిలో పరిస్థితులు క్షీణిస్తున్నాయి. ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. ఆహారం, తాగునీరు లేక విలవిల్లాడిపోతున్నారు. ఈజిప్టు రఫా సరిహద్దు వెంబడి మానవతా సాయం కూడా పూర్తిస్థాయిలో బాధితులకు చేరడం లేదు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకు 18,205 మంది చనిపోగా, 50వేల మందికి గాయాలైనట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. సోమ-మంగళవారం మధ్యరాత్రి జరిగిన వైమానిక దాడిలో చిన్నారులు సహా 22 మంది చనిపోయినట్లు ఆరోగ్య అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం అత్యవసర సిబ్బంది వెతుకుతున్నారు. మృతులు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. రఫా వద్ద గతంలో కంటే తీవ్రస్థాయిలో దాడులు జరిగినట్లు స్థానికులు తెలిపారు. 'రాత్రిళ్లు నిద్ర ఉండటం లేదు. పగలంతా వీధుల వెంబడి తిరుగుతున్నాం. పిల్లల కోసం ఆహారం కోసం అన్వేషిస్తున్నాం. ఎక్కడా ఆహారం లేదు' అని ఆరుగురు పిల్లలకు తండ్రి అబు ఖలీల్ (40) తెలిపారు. కనీసం రొట్టెలు దొరకడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అందుబాటులో ఉన్న పరిమిత ఆహారం ధర రెండింతలు పెరిగిందని చెప్పారు. ఓ వైపు బాంబులు మరోవైపు పస్తులు ఉంచడం వల్ల ఇజ్రాయిల్ తమను రెండు విధాలుగా చంపుతోందని ఖలీల్ ఆవేదన వ్యక్తంచేశారు. కాల్పుల విరమణకు ఐరాస భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని అమెరికా వీటో అధికారంతో అడ్డుకున్న తర్వాత ఇజ్రాయిల్ దాడుల తీవ్రతను పెంచింది. వందలాది మంది పలస్తీనా పౌరులను హతమార్చింది. గాజా ప్రజల్లో క్షుద్బాధ పెరుగుతోందని సహాయక సంస్థలు తెలిపాయి. సగానికిపైగా జనాభా పస్తులుంటున్నట్లు ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమం వర్గాలు వెల్లడించాయి. రఫా గుండా పరిమిత సాయమే గాజా ప్రజలకు చేరుతున్నట్లు ఐరాస మానవతా కార్యాలయం (ఓసీహెచ్ఏ) మంగళవారం పేర్కొంది. కొన్ని రోజులుగా సహాయ సామాగ్రి సరఫరా నిలిచిపోయినట్లు తెలిపింది. ప్రధాన మార్గాల్లో రవాణాకు అనుమతి లేదని పేర్కొంది. తాజాగా కమాల్ అద్వాన్ ఆసుపత్రిలోకి చొరబడిన ఇజ్రాయిల్ దళాలు అక్కడున్న పురుషులు, వైద్య సిబ్బందిని చుట్టుముట్టినట్లు గాజా ఆరోగ్యశాఖ అధికార ప్రతినిధి అష్రాఫ్ అల్ ఖిద్రా తెలిపారు.

సజ్జలను కలిసిన ఓబులేసు, బాలకాశి

విశాలాంధ్ర-విజయవాడ: తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ వర్కర్లు నిరవధిక సమ్మె దిగారని, వారి సమస్యల పరిష్కారం కోసం జోక్యం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీఐటీయూ నాయకులు బాలకాశి విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిలోని సజ్జల కార్యాలయంలో ఆయనను ఓబులేసు, బాలకాశి మంగళవారం కలిశారు. లక్షమందికి పైగా అంగన్‌వాడీ ఉద్యోగులు రాష్ట్రంలో సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ,ఐఎఫ్‌టీయూ సంఘాలకు సంబంధించిన అంగన్‌వాడీలు సమ్మెలో పాల్గొన్నారని చెప్పారు. ప్రభుత్వం రెండు నెలలుగా నాన్చుడు ధోరణితో వ్యవహరించడం వల్ల విధి లేని పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందని వివరించారు. ఇప్పటికైనా తమరు జోక్యం చేసుకొని అంగన్వాడీ కార్మికుల న్యాయబద్ధమైన జీతాల పెంపు, గ్రాట్యుటీ, అనేక రకాల యాప్‌లు తీసివేయడం, 62 సంవత్సరాల సర్వీసు ఇవ్వడం వంటి ప్రధానమైన సమస్యలు పరిష్కరించి సమ్మెను నివారించాలని కోరారు. సజ్జల రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నాయకులను చర్చలకు పిలిచామని, ఈ చర్చల్లో మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొంటారని చెప్పారు.

జర్నలిస్టు ఆసిఫ్ సుల్తాన్‌కు విముక్తి

జమ్మూకశ్మీర్ యంత్రాంగానికి హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: కశ్మీరీ జర్నలిస్టు ఆసిఫ్ సుల్తాన్‌కు జమ్మూకశ్మీర్ హైకోర్టు ఊరట నిచ్చింది. ఆసిఫ్ సుల్తాన్ విడుదలకు ఆదేశాలు జారీచేసింది. సరైన సాక్ష్యాధారాలు లేకుండా ఆయనను నిర్బంధంలో ఉంచడం చట్టవిరుద్ధమని ఈ కేసును విచారించిన జస్టిస్ వీసీ కౌల్‌తో కూడుకున్న ఏకసభ్య ధర్మాసనం పేర్కొంది. ఆసిఫ్ సుల్తాన్‌ను వదిలిపెట్టాలని కేంద్ర పాలిత ప్రాంత యంత్రాగానికి సూచించింది. తన నిర్బంధాన్ని సవాల్ చేసేందుకు అవసరమైన అధికారిక పత్రాలను ఆసిఫ్ సుల్తాన్‌కు ఇవ్వకపోవడాన్ని ఖండించింది. అధికారుల తీరును న్యాయస్థానం ఆక్షేపించింది. చట్టప్రకారం అవసరమైన ఆధారాలను చూపడంలో అధికారులు విఫలమైనట్లు పేర్కొంది. ప్రజాభద్రతా చట్టం (పీఎస్ఏ) కింద ఆసిఫ్ సుల్తాన్ నిర్బంధాన్ని పొడిగించేందుకు నిరాకరించింది. ఎఫ్ఐఆర్ ప్రతులు, వాంగ్మూలాలు, కేసు దర్యాప్తు వివరాలను ఆసిఫ్ సుల్తాన్‌కు కశ్మీర్ అధికారులు ఇవ్వలేదని కోర్టు గమనించింది. మరే కేసులో ఆసిఫ్ సుల్తాన్ నిందితుడు కాకపోతే ఆయనను విడుదల చేయాలని అధికారులకు జస్టిస్ కౌల్ ఆదేశాలిచ్చారు. ఆసిఫ్ సుల్తాన్ అరెస్టు అయిన ఐదేళ్ల తర్వాత ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఐదేళ్ల నిర్బంధం చట్టవ్యతిరేకమని న్యాయస్థానం స్పష్టంచేసింది. ఓ ఆంగ్ల మాసపత్రిక 'కశ్మీర్ నరేటర్'లో పనిచేసే సమయంలో ఆసిఫ్ సుల్తాన్ తన శ్రీనగర్ నివాసంలో ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చినట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు ఆయనపై 2018లో ఉపాతో పాటు ఇప్పటి ఐపీసీ (అప్పటి ఆర్‌పీసీ) కింద కేసు నమోదు చేశారు. సరైన ఆధారాలు చూపడంలో దర్యాప్తు అధికారులు విఫలమైనట్లు పేర్కొంటూ గతేదాది ఏప్రిల్ 5న శ్రీనగర్‌లోని కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది. అయితే పీఎస్ఏ కింద ఆసిఫ్ సుల్తాన్‌పై కేసును అధికారులు పెట్టారు. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్లు, నేరపూరిత కుట్ర చేసినట్లు నిందించి ఆసిఫ్ సుల్తాన్‌ను పీఎస్ఏ కింద అరెస్టు చేశారు.

ప్రతి గింజా కొనుగోలు

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపే బాధ్యతను పౌరసరఫరాల శాఖ అధికారులు తీసుకుంటారని, ఆర్బీకేల వారీగా ఈ కొనుగోళ్లు జరుగుతాయని చెప్పారు. ఇదే సమయంలో సంబంధిత అధికారులకు దీనికి సంబంధించి ఆదేశించారు. సకాలంలోనే వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు ఇప్పటికే అన్నిరకాల చర్యలు ప్రభుత్వం తీసుకుంటోందని వివరించారు. పంట నష్టపోయినవారికి వైఎస్సార్ ఉచిత బీమా కింద వారికి పరిహారం అందించడానికి అనుసరించాల్సిన ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టి, నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభించారా? అని అధికారులను ఆరా తీశారు. దీంతో ఈ నెల 11 నుంచి 18 వరకు ఎన్యూమరేషన్ జరుగుతోందని, 19 నుంచి 22 వరకు సోషల్ ఆడిట్ కోసం ఆర్బీకేలలో జాబితాలు అందుబాటులో ఉంచుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఆ తర్వాత 23 నుంచి 25 వరకు సవరణలు, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 26న జిల్లా కలెక్టర్లు తుది జాబితాలు ప్రభుత్వానికి పంపనున్నట్లు వారు సీఎంకు వివరించారు. సంక్రాంతిలోగా ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందాలని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రి జోగి రమేశ్, ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలు కొడాలి నాని, పేర్ని నాని, వల్లభనేని వంశీ, సామినేని ఉదయభాను, సింహాద్రి రమేశ్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్, పౌరసరఫరాల శాఖ ఎండీ వీరపాండియన్ పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్, సీఎంవో అధికారులు హాజరయ్యారు.

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనలు రూపొందించలేదన్నారు.

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ సెంటర్ల నిర్వహణకు అంగన్‌వాడీలే పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం పేదరికం, పోషకాహార లోపం, ఆకలి సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఐసీడీఎస్‌కి నామమాత్రంగా 20,554.31 కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. ఐసీడీఎస్ లక్ష్యానికి విరుద్ధంగా అంగన్‌వాడీ కేంద్రాలను కుదించటానికి నూతన విద్యావిధానం తీసుకువచ్చి కేంద్రాలను విలీనం చేస్తున్నారని, లబ్ధిదారులను కుదించటానికి పోషణ ట్రాక్ యాప్‌ను తీసుకువచ్చిందని విమర్శించారు. ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి మాట్లాడుతూ కొత్తగా గర్భిణీలు, బాలింతలకు ఫేస్ యాప్ తీసుకువచ్చారని, ఫోన్లు పనిచేయకపోయినా, నెట్‌సిగ్నల్ లేకపోయినా అమలు చెయ్యాలని అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ అంగన్‌వాడీలంతా ఐక్యంగా పోరాడాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. గుంటూరు, పల్నాడు, తిరుపతి, విశాఖ, ఏలూరు వంటి అనేక ప్రాంతాల్లో అంగన్‌వాడీలు ఆందోళనకు దిగారు.

జగన్‌కు కేసీఆర్ గతే

(మొదటిపేజీ తరువాయి)

ఒరిగేదేమీ లేదని, తనపై ఉన్న వ్యతిరేకతను జగన్ ఎమ్మెల్యేలపై చూపిస్తున్నారన్నారని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రభుత్వ మార్పు తప్పదన్నారు. ఏపీలో తెలంగాణ ఎన్నికల ఫలితాలు పునరావృతం కాబోతున్నాయని నారాయణ చెప్పారు. తుపాను ప్రభావంతో 60 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, ముఖ్యమంత్రి మాత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా గాల్లో వెళ్లి వచ్చారన్నారు. జమ్మూ-కశ్మీర్‌కు సంబంధించి 370 ఆర్టికల్‌పై సుప్రీంకోర్టు తీర్పు దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థ పంజరంలో చిలుకలా మారిందని ఆవేదన వెలిబుచ్చారు. బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీ, కేంద్రంలో బీజేపీ పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. బై జ్యూస్ సంస్థ ద్వారా ఆన్‌లైన్ క్లాసులు బోధిస్తామని చెప్పి...ఆ పనిని బజాజ్ సంస్థకు అప్పగించి వేలాదిమంది విద్యార్థుల తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. బై జ్యూస్, బజాజ్ కార్యాలయాలపై దాడులకు పూనుకొని బాధితులను ఆదుకోవాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 55 వేల మంది అంగన్వాడీ కార్యకర్తలు పనిచేస్తుంటే వారికి ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున మీడియా ముందుకు వచ్చి జీతాలు పెంచితే అమ్మఒడి, రైతు భరోసా, రేషన్ కార్డులు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆగిపోతాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీ వర్కర్లను ప్రభుత్వం అనేక పనులకు వినియోగించుకొని కనీస వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. వివిధ రాష్ట్రాలలో చెల్లిస్తున్న కనీస వేతనాలను ఆంధ్రప్రదేశ్‌లో తక్షణం అమలు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో వేలాదిమంది రైతులు తుపాన్ కారణంగా నష్టపోయారని చెప్పారు.

గ్రామ సచివాలయాల ద్వారా ఎన్ని ఎకరాలలో ఎంత పంట నష్టమైందో అధ్యయనం చేసి...ఎకరాకు 30 వేల రూపాయలు తక్షణ సాయం అందించాలన్నారు. ఎరువులు, విత్తనాలు, మందులు ఉచితంగా అందచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె శివారెడ్డి, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ పాల్గొన్నారు.

అలకలు... రాజీనామాలు

(మొదటిపేజీ తరువాయి)

స్పందించడం లేదని సమాచారం. ఇక విశాఖ జిల్లా విషయానికి వస్తే గాజువాక ఇన్‌చార్జి నియామకం కాకరేపుతోంది. అక్కడ ఇన్‌చార్జి దేవన్‌రెడ్డి స్థానంలో వరికూటి రామచంద్రరావును నియమించడంతో అలకలు పెరిగాయి. దేవన్‌రెడ్డి రాజీనామా చేశారు. అసలు వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్ బాబు రాజీనామాతో అసమ్మతి చాపకింద నీరులా సాగింది. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్ వ్యాపార అవసరాల రీత్యా టీడీపీలో గెలిచి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా గాజువాకలో వైసీపీకి తిప్పలు తప్పడం లేదు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి, ఆయన కుమారులకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని అధిష్ఠానం చెప్పడంతో అసమ్మతి రాగం మొదలైంది. ఈ నేపథ్యంలో వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి రంగంలోకి దిగి...ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి రాజీనామా లేదంటూ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో ప్రకటన చేయించారు. దక్షిణ నియోజకవర్గంలోనూ ఇదే అసమ్మతి కొనసాగుతోంది. తన వార్డులో అభివృద్ధి కార్యక్రమాలకు వైసీపీ నిధులివ్వడం లేదని, తాను ప్రజల సంక్షేమానికి పూనుకుంటున్నా దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి అడ్డుకుంటున్నారని 39వ వార్డు కార్పొరేటర్ సాదిక్ బహిరంగంగా ఆరోపించారు. తన ఇబ్బందుల్ని ఉత్తరాంధ్ర వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని సాదిక్ ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి అక్రమాని విజయనిర్మలను తప్పించి విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. దక్షిణం, గాజువాక వైసీపీలో సాదిక్, దేవన్ రెడ్డి రాజీనామా పరిణామాలు పార్టీ నేతల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కార్పొరేటర్ సాదిక్ రాజీనామా అనంతర పరిస్థితులపైనా వైవీ సుబ్బారెడ్డి దృష్టి సారించలేకపోయారు. ఆయనను పిలిచి మాట్లాడలేకపోయారు.

ర్యాగింగ్ భూతం

(మొదటిపేజీ తరువాయి)

గడుపుతున్నారు. మరుసటిరోజు ఆలస్యంగా లేచి, కళాశాలల్లో జరిగే తరగతులకు వారు హాజరు కాలేకపోతున్నారు. ఈ రికార్డులతోపాటు ఇతరత్రా పనులూ జూనియర్లతో చేయిస్తున్నట్లు తెలిసింది. జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ద్వారా రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలల్లో ఇతర రాష్ట్రాల విద్యార్థులు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందారు. అలా వచ్చిన జూనియర్లతో హాస్టళ్లల్లో రాత్రి వేళ సీనియర్లు రికార్డులు రాయించడం, అదనపు పనులు చేయించడం వెరసి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. మీ రికార్డులను మేమెందుకు రాయాలని ప్రశ్నించిన జూనియర్లపై సీనియర్లు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. జూనియర్లపై ప్రిన్సిపాళ్లకు ఫిర్యాదు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధిత విద్యార్థులు వాపోతున్నారు. కొంతకాలం నుంచి మెడికల్ విద్యార్థులు ఎవరికీ చెప్పుకోలేక తమలో తామే నలిగిపోతున్నారు. ఇక ఓపిక పట్టలేక ఇటీవల ఒకరిద్దరు విద్యార్థులు తాము పడుతున్న ఇబ్బందుల్ని తల్లిదండ్రుల దృష్టికి తీసురావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రుల సహకారంతో తమను సీనియర్లు వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఆయా కళాశాలల యాజమాన్యానికి బాధిత విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకు ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

భద్రతలేని మెడికల్ కళాశాలలు ఎందుకు ?

విద్యార్థులకు భద్రతలేని మెడికల్ కళాశాలలు ఎందుకని ప్రభుత్వాన్ని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను, సీట్లను పెంచి వైద్యవిద్యకు పెద్దపీట వేశామని ఆర్భాటంగా సీఎం జగన్ ప్రభుత్వం చెబుతోంది. వాటి నిర్వహణలో మాత్రం పూర్తిగా చేతులెత్తేసింది. ప్రతి ప్రాంతానికి సూపర్ స్పెషాల్టీ వైద్యసేవలు చేరువయ్యేలా, విద్యార్థులకు వైద్య విద్యను పెంచేలా 17 కొత్త కళావాలల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఐదు నూతన వైద్య కళాశాలలను ప్రారంభించి, వాటి ద్వారా కొత్తగా 750 సీట్లను అందుబాటులోకి తెచ్చింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరో 850సీట్లు అందుబాటులోకి రానున్నాయి. 2025-26లో ఏడు వైద్య కళాశాలల ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిన విషయం విదితమే. నూతన కళాశాలల్లో బోధనా సిబ్బందిని పూర్తిగా నియమించలేదని, భవనాలు పూర్తి స్థాయిలో నిర్మించలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. తరగతులు ప్రాంభమయ్యాక వైద్య కళాశాలలకు, బోధనాస్పత్రులకుగాను 3,530 పోస్టులను మంజూరు చేశారు. పాత, కొత్త వైద్య కళాశాలల్లో పర్యవేక్షణ లోపం కన్పిస్తోందన్న విమర్శలున్నాయి. జూనియర్ విద్యార్థులు ర్యాగింగ్ బారిన పడటంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కష్టపడి, లక్షలాది రూపాయలు వెచ్చించి... తమ పిల్లలను ఎంబీబీఎస్‌లో చేర్పిస్తే, ఈ విధంగా ర్యాగింగ్‌కు బలవడంపై వారికి దిక్కుతోచడం లేదు. నీట్‌లో ర్యాంకు సాధన కోసం ఎనిమిదో తరగతి నుంచి టెన్త్ వరకు ఫౌండేషన్ కోర్సు, ఆ తర్వాత ఇంటర్‌తోపాటు నీట్ ఇంటిగ్రేటెట్ కోర్సులను విద్యార్థులు చదివి ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. వారికి సరిపడా ర్యాంకు రాకపోతే మళ్లీ ఏడాదిపాటు లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని, నీట్‌లో ఉత్తమ ర్యాంకులు పొందుతున్నారు. ఇంత కష్టపడి ఎంబీబీఎస్‌లో మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రశాంతత కరువైంది. జూనియర్ విద్యార్థులు ర్యాగింగ్ బారిన పడి, వారి చదువులపై పూర్తిగా దృష్టి పెట్టలేక పోతున్నారు. నీట్‌లో మంచి ర్యాంకులు సాధించిన వారు కూడా ఎంబీబీఎస్‌కు వచ్చాక చదువులో వెనుకబాటుకు గురవడం విస్మయం కలిగిస్తోంది.

ఎంసీఐకి ఫిర్యాదుల వెల్లువ

వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ అంశంపై మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)కు విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు కౌన్సిల్ మెయిల్ పంపంగా... దానిపై కళాశాల వర్గాలు చాలా గోప్యంగా ఉంచుతున్నాయని పేరెంట్స్ అసోసియేషన్ విమర్శిస్తోంది. ఆయా వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ జరిగిందా? లేదా? అనే దానిపై నిజనిర్ధారణ కోసం తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ వేయాల్సిన అవసరముంది. ర్యాగింగ్‌పై పదేపదే ఫిర్యాదులు వచ్చినా వైద్యాధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తల్లిదండ్రుల సంఘాలు కేవలం సోషల్ మీడియా వేదికగా ప్రకటనలకే పరిమితమవుతున్నాయని, లేఖలు రాసి వదిలేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రుల సంఘాలు ప్రత్యక్ష ఆందోళనలకు పిలుపునివ్వాలని కోరుతున్నారు. గతంలో ర్యాగింగ్‌ను తట్టుకోలేక విద్యార్థులు చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలున్నాయి. సీఎం జగన్ తక్షణమే స్పందించి వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ నివారణకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను నియమించాలి. ప్రతి విద్యా సంస్థలలో విద్యార్థి తల్లిదండ్రులు, యాజమాన్యాలు, కళాశాల సిబ్బందితో విద్యా కమిటీలు ఏర్పాటు చేసి, ర్యాగింగ్‌ను అరికట్టాల్సిన అవసరముంది. లేకుంటే రాబోయే రోజుల్లో ఈ ర్యాగింగ్ మరింత పెరిగి, విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు గురయ్యే ప్రమాదముంది.

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి

సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-వినుకొండ : రాష్ట్రంలో రైతాంగం, పేద ప్రజలు, కష్టజీవుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని, 2024 ఎన్నికల్లో ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను ప్రజలు ఇంటికి సాగనంపుతారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వినుకొండ పట్టణంలోని శివయ్య భవన్‌లో జరిగిన సీపీఐ నియోజకవర్గ సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం... మన దేశానికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని తిరగరాస్తోందని విమర్శించారు. దళితులు, మైనారిటీలు, కార్మికులు, రైతుల సమస్యలపై ప్రధాని నరేంద్ర మోదీకి ఏమాత్రం శ్రద్ధ లేదని, మతోన్మాదంతో కులాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ కాలం గడుపుతోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతలను సీబీఐ, ఈడీ కేసులతో బెదిరిస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని అన్నారు. సామాన్య ప్రజలు భరించలేని స్థితికి నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిపోయాయని తెలిపారు. అధికారంలోకి వచ్చే ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచబోమని, ఆనాటికి ఉన్న ధరలు తగ్గిస్తామని ప్రజలకు చేసిన వాగ్దానం నెరవేర్చలేదని విమర్శించారు. వర్షాభావం, తుపాను పరిస్థితుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇటీవలి తుపాను రైతాంగాన్ని కడగళ్ల పాలు చేసిందని అన్నారు. కేంద్రం మిచౌంగ్ తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి 50 వేల కోట్ల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, జలాశయాల్లో నీరు లేక పంట భూములు బీడు భూములుగా మారాయన్నారు. బోరు బావులతో పంటలు సాగు చేసినప్పటికీ, తుపాను రైతాంగం నోట్లో మట్టికొట్టిందన్నారు. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అఖిలపక్ష రాజకీయ పార్టీలను సమీకరించి, అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, డిసెంబరు 14న రాష్ట్రంలో అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద రైతులు, కూలీలతో ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రైతులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ సీపీఐ నాయకత్వంలో జిల్లాలో ఆయా నియోజకవర్గాల సమస్యలు సేకరించి, అభివృద్ధి సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి పార్టీ పోరాట కార్యాచరణ తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి ఇవ్వాలని, వికలాంగులకు పెన్షన్ రూ.7 వేలుగా పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, వికలాంగుల పెన్షన్ దారుల కమిటీలు ఏర్పాటు చేసి, వారి పెన్షన్ల పెంపుదలకు పోరాట కార్యక్రమాన్ని కూడా రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు విద్యుత్ బిల్లుల షాక్ తగులుతోందన్నారు. త్వరలో విద్యుత్ వినియోగదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి, పెరిగిన విద్యుత్ చార్జీలపై పోరాట కార్యక్రమాన్ని తీసుకొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ సమావేశానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పట్టణ కార్యదర్శి, రైతు సంఘం జిల్లా నాయకులు ఉలవలపూడి రాము, మాజీ వైస్ చైర్మన్ సంద్రపాటి సైదా, పటాన్ లాల్ ఖాన్, షేక్ కిషోర్, సీపీఐ మండల కార్యదర్శులు వూట్ల రామారావు, బూదాల సాగర్, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, ఎ.పవన్ కుమార్, మహిళా సంఘం కార్యదర్శి బి.చైతన్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు శశి కుమార్, సాంబయ్య, షేక్ మస్తాన్, బిస్కెట్ వలి, షేక్ అలీ, రమణమ్మ, షేక్ బాజీ, అప్పమ్మ, పద్మావతి, బర్మా లక్ష్మి, కొండముట్ల వెంకటేశ్వర్లు, అప్పారావు, ధూపాటి మార్కు దావీదు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర సంక్షేమ పథకాలు

గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్రబ్యూరో-ఏలూరు: భారత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులందరికి అందజేయడంతోపాటు ఆయా పథకాల అమల్లో సంతృప్తి స్థాయిని సాధించడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ తెలిపారు. మంగళవారం ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయిగూడెంలోని శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో జిల్లా అధికార యంత్రాంగం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత వికసిత్ భారత్ సంకల్పయాత్ర డిజిటల్ ప్రచార వాహనాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, గృహనిర్మాణశాఖ స్పెషల్ సెక్రటరీ మహ్మద్ దివాన్ మైదీన్, జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బీ లావణ్యవేణి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో గవర్నరు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన వారందరికీ అందించాలన్నదే సంకల్పయాత్ర లక్ష్యమన్నారు. వివిధ పథకాల కింద అర్హులైన ఇప్పటివరకు ప్రయోజనాలు పొందని బలహీన వర్గాలను చేరుకోవడానికి, సమాచార వ్యాప్తి, పథకాల గురించి అవగాహన కల్పించడం వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పౌరసంఘాల సభ్యులందరూ భారత ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలపై అర్హులందరికీ అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులందరూ చురుగ్గా పాల్గొంటేనే వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయగలరన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీడీ మేరీ ప్రశాంతి, డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 18 నుంచి జరిగే

కవులు, కళాకారుల పాదయాత్రను జయప్రదం చేయండి

– ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజల మధ్య సోదర భావం, సమానత్వం, మతసామరస్యం పెంపొందించడం కోసం ప్రజానాట్యమండలి దేశవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టిందని, అందులో భాగంగా ఈనెల 18 నుంచి గుంటూరు-విజయవాడ మధ్య కవులు, కళాకారులు పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్ వెల్లడించారు. మంగళవారం విజయవాడ దాసరి భవన్‌లో పాదయాత్ర కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రనాయక్ మాట్లాడుతూ ఈ ఏడాది భగత్ సింగ్ జయంతి సెప్టెంబరు 28న ప్రారంభమై మహాత్మా గాంధీ వర్ధంతి 2024 జనవరి 30 నాటికి ఈ పాదయాత్రలు ముగుస్తున్నాయని చెప్పారు. సమాజాన్ని చైతన్యం చేయడంలో కళలు, సాహిత్యం ఎంతో చురుకైన పాత్ర పోషిస్తాయని, అవి మరింత పటిష్టం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజానాట్యమండలి ప్రజా చైతన్యానికి కృషి చేస్తోందని తెలిపారు. భిన్న మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన సమాఖ్య దేశంలో వివిధ రకాల రుగ్మతలు మానవ సమాజాన్ని వెంటాడుతున్న కారణంగా దేశ పరిరక్షణ కోసం రచయితలు, కళాకారులు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రజలను యువకులు, విద్యార్థులను కలుసుకుని కళారూపాలు, పాటలతో వారిని జాగృతం చేస్తారని తెలిపారు. దేశభక్తులు ఈ పాదయాత్రలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి విజయవాడ నగర ఇన్‌ఛార్జ్ లంక దుర్గారావు మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా సోదర భావంతో ప్రజలందరూ మెలగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీ ప్రజానాట్య మండలి విజయవాడ నగర నాయకులు కె.వి.భాస్కరరావు ఎస్.కె.నజీర్, దోనేపూడి సూరిబాబు, కాళ్ల చిన్నప్ప, మహిళా సమాఖ్య నాయకురాలు పంచదారల దుర్గాంబ పాల్గొన్నారు.

జమ్మూ-కశ్మీర్ బిల్లును వైసీపీ బలపరచడం తగదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన జమ్మూ-కశ్మీర్ బిల్లులను వైసీపీ బలపరచడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ అప్రజాస్వామిక బిల్లులను బలపరచడమే కాకుండా మొత్తం కశ్మీర్ చరిత్రనే వక్రీకరించి ఆర్ఎస్ఎస్ వాదనను పార్లమెంటులో విజయసాయిరెడ్డి వినిపించారని తెలిపారు. జమ్మూ-కశ్మీర్ బిల్లులో అసెంబ్లీలో నామినేషన్ పద్ధతి ద్వారా కేంద్రమే ఎమ్మెల్యేలను నియమిస్తుందని, ఇది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను తమ గుప్పెట్లో పెట్టుకోవటానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రాల అసెంబ్లీలకు శాసన సభ్యులను నామినేషన్ చేయటం రాష్ట్ర ప్రభుత్వాల హక్కుగా ఉందన్నారు. దాన్ని ఈ చట్టం ద్వారా కేంద్రానికి బదలాయించుకుందని వివరించారు. ఇది మొత్తం ప్రజాస్వామ్య విలువలను, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే చర్యని, దీన్ని పార్లమెంటులో విజయసాయిరెడ్డి వెనకేసుకురావడం హానికరమని ఖండించారు. ఇప్పటికైనా రాష్ట్ర హక్కులను పరిరక్షించేందుకు పార్లమెంటులో గట్టిగా వైసీపీ ఎంపీలు నిలబడాలని, ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు కృషి చేయాలని సూచించారు. బీజేపీకి వంత పాడటం మానుకుని ప్రజల తరఫున నిలబడాలని కోరారు.

సజ్జలను కలిసిన కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నూతన కమిటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కమిటీ మంగళవారం తాడేపల్లిలో కలిసింది. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్వర్యంలో సజ్జలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆప్కాస్ ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి రాష్ట్ర కమిటీ ధన్యవాదాలు తెలిపింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మహాసభ జ్ఞాపికను సజ్జలకు నేతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నూతన కమిటీ అధ్యక్షులు కె.సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు, ట్రెజరర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహని తట్టిలేపే 'బండి' కవిత్వం

విశాలాంధ్ర - విశాఖ: సామాజిక స్పృహని తట్టిలేపే కవితలు రాయడం బండి సత్యనారాయణకే సాధ్యమని వక్తలు ప్రశంసించారు. అరసం విశాఖ జిల్లా సమితి అధ్వర్యంలో విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో బండి సత్యనారాయణకు శ్రీగెద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ 13వ రాధిక సాహితీ అవార్డు అందజేశారు. ప్రముఖ రచయిత గెద్దాడ కస్తూరి ప్రసాద్ ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. బండి రచనలు సమాజంలోని ఇతివృత్తాలను ప్రతిబింబిస్తూ పాఠకుల్లో ఆలోచనలు రేకెత్తించేలా ఉంటాయని వక్తలు అన్నారు. ప్రకృతి ఒడిలో మమేకమై బండి రచనలు చేసినట్లు తెలిపారు. ఆయన కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఉపాధ్యక్షుడు ఎస్ హనుమంతరావు, ఆకాశవాణి డీడీజే(ఈ) సి సుబ్బారావు, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, స్వర్ణ శైలజ, పావని, బుక్‌హౌస్ మేనేజర్ రాజు పాల్గొన్నారు.

ఎల్‌బీ శ్రీరామ్ సందర్శన: పుస్తక మహోత్సవాన్ని సినీ నటుడు ఎల్‌బీ శ్రీరామ్ సందర్శించారు. లాభాపేక్ష లేకుండా విశాలాంధ్ర సంస్థ సాహిత్య విస్తరణకు కృషి చేస్తూ పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పుస్తక పఠనంపై మక్కువ చూపాలని, జీవిత అభ్యున్నతికి ఇది దోహదమవుతుందన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఎన్‌హెచ్‌ఆర్ ఏసీసీ నిర్వహించిన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఓటు హక్కుపై కూడా ప్రజల్లో ఇంకా అవగాహన పెంపొందాలని అభిప్రాయపడ్డారు. మానవ హక్కుల పరిరక్షణలో ప్రతి పౌరుని బాధ్యత గుర్తుచేసి, వారిని అందుకు సమాయత్తం చేసే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం జాతీయ మానవ హక్కులు నేర నిరోధక కౌన్సిల్ ప్రాథమిక విద్యా స్థాయినుంచి పౌర హక్కుల అంశాలను పాఠ్యాంశాలుగా బోధించాల్సిన అవసరం ఉందన్నారు. బాలలకు విద్యా హక్కు చట్టంలో భాగంగా బోధనా పద్ధతులపై బాలలకు, వారి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరగాలన్న ప్రభుత్వ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల సంఘం చైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్.రాజు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం ఎన్‌హెచ్‌ఆర్‌ఏసీసీ కేంద్ర ప్రభుత్వం, పోలీస్ విభాగాలతో కలిసి పనిచేస్తోందన్నారు. హక్కుల పరిరక్షణలో భాగంగా, పౌరులకు న్యాయస్థానాల్లో తమ వంతు సహకారం అందిస్తున్నామని వివరించారు. ఎన్ హెచ్ ఆర్‌ఏసీసీ నేషనల్ చైర్మన్ డాక్టర్ బీ శ్యాంసన్, విజిలెన్స్ మానిటరింగ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు తారక ప్రసాద్ మాట్లాడుతూ ఓటు హక్కు సద్వినియోగించుకునేందుకు త్వరలో రాష్ట్ర వ్యాప్త సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఆర్ మీడియా అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర తిలక్, ఎన్సీబీ నేషనల్ చైర్మన్ డాక్టర్ జాన్ మాస్కు మాట్లాడుతూ... పౌర హక్కుల పరిరక్షణలో ప్రజాసంఘాల కృషి అభినందనీయమన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు మోదీని సాగనంపాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిరక్షించుకునేందుకు కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కారును సాగనంపాలని వక్తలు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మేథావులు, , రైతు సంఘాల నాయకులు సదస్సు నిర్వహించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కేఎల్ రావు కుమారుడు విజయారావు మాట్లాడుతూ... మోదీ సర్కారు ముఖ్యమైన బిల్లులను స్టాండింగ్ కమిటీల పరిశీలనకు పంపే సంప్రదాయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. దాని వల్ల పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి భంగం కలుగుతోందన్నారు. ఆర్టికల్ 19 ప్రసాదించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హరించబడుతున్నాయని... ప్రాథమిక హక్కులకు సైతం భంగం కలుగుతోందన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ఫెడరల్ - లౌకిక స్ఫూర్తి పరిరక్షణకు కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. లేకుంటే ప్రజాస్వామిక విలువలు మరింతగా దిగజారి పోయి... దేశంలో నియంతృత్వం ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించబడే పత్రికా స్వేచ్ఛకు భంగం కలుగుతోందన్నారు. నిష్పక్షపాతంగా ప్రజలకు సమాచారాన్ని అందించే మీడియా సంస్థలపైన తప్పుడు కేసులు బనాయించి, వారి గొంతు నొక్కేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆదేశిక సూత్రాలకు భిన్నంగా సహజవనరులను, ప్రజల సంపద అయిన ప్రభుత్వ రంగ సంస్థలను అదానీకి, అంబానీకి కారుచౌకగా కట్టబెడుతున్నారన్నారు. ఫెడరల్ స్ఫూర్తిని తుంగలో తొక్కుతూ రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందని తెలిపారు. బ్రిటీష్ వారి విభజించు, పాలించు సూత్రాన్ని అమలు చేస్తూ... ప్రజలమధ్య విద్వేష భావనను పెంచి, రాజకీయ ప్రయోజనం పొందేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సహజ న్యాయ సూత్రాలు, చట్టాలను ప్రక్కకు పెట్టి బుల్డోజర్లతో మైనారిటీల ఆస్తులు, చర్చిలు ధ్వంసం చేస్తున్నారన్నారు. సభకు అధ్యక్షత వహించిన వడ్డేశోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పేదలపై మోయలేని పన్నుల భారాన్ని మోపుతూ, కార్పోరేట్లకు లబ్ధి చేకూర్చడం, ఆదివాసీల హక్కులను హరిస్తూ, భూములను లాక్కొంటూ అటవీ సంరక్షణ చట్టానికి సవరణ చేయడం వంటి దుర్మార్గా చర్యలకు మోదీ సర్కారు పాల్పడిందన్నారు. గతంలో యూపీఏ-వామపక్ష కూటమి హయాంలో సమాచార హక్కు చట్టం, వినియోగదారుల పరిరక్షణ చట్టం, జాతీయ ఉపాధి హామీ పథకం చట్టం, లోక్‌పాల్ చట్టం, 2013 భూసేకరణ చట్టం మున్నగు అనేక ప్రజానుకూల చట్టాలు చేయగా... 9 1/2 ఏళ్ల బీజేపీ పాలనలో ప్రజానుకూల చట్టం ఒక్కటి కూడా చేయకపోవడం విచిత్రం అన్నారు. సి2+50% ఎమ్ఎస్‌పీ హామీని విస్మరించి, రైతులకు ఒక్క రూపాయి కూడా రుణమాఫీ చేయకపోగా కార్పొరేట్లకు రూ.14.60 లక్షల కోట్లు మాఫీ చేశారన్నారు. విభజన చట్టం లోని హామీలను అమలు చేయకుండా ఆంధ్ర రాష్ట్రానికి తీవ్రం అన్యాయం చేశారని... 32మంది ఆంధ్రుల బలిదానంతో సాధించుకున్న విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేస్తున్నారన్నారు. దశాబ్దాలుగా కార్మికులు సాధించుకున్న చట్టాలను రద్దుచేసి,4 లేబర్ కోడ్లను తేవడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాసిన మోదీ ప్రభుత్వాన్ని సాగనంపవలసిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఈ సమావేశంలో టి.లక్ష్మీనారాయణ, పి.జమలయ్య, పీవీ రమణారెడ్డి, , కె.ఉమా మహేశ్వరరావు, భవానీ ప్రసాద్, సీ భాస్కరరావు, డీ హరనాథ్, దివికుమార్, వీ వెంకటేశ్వర్లు, మర్రెడ్డి వెంకటరెడ్డి, పాతూరి రవి, నరసింగరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డోన్‌లో ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర-డోన్: ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల రాష్ట్ర సదస్సుకు డోన్ పట్టణం బుధవారం వేదిక కానుంది. రాష్ట్రంలోని నలుమూలల నుంచి గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘాలు, వివిధ వృత్తి సంఘాల నాయకులు పెద్దఎత్తున ఈ సదస్సుకు తరలిరానున్నారు. సదస్సుకు డోన్ పట్టణం ముస్తాబయింది. పెద్దఎత్తున ఆహ్వానితులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఏపీ చేతివృత్తి దారుల సమాఖ్య అధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా చేతివృత్తిదారుల సమాఖ్య జాతీయ నాయకులు జె.వి.సత్యనారాయణమూర్తి, ఏపీ గొర్రెలు, మేకల పెంపకదారుల సమాఖ్య నాయకులు వై.నాగేశ్వరరావు యాదవ్, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య, ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య తదితరులు పాల్గొననున్నారు. సదస్సులో గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యలను చర్చించి, వాటి పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు తెలిపారు.

వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ రాష్ట్ర యువజన విభాగం నూతన కమిటీని అధిష్ఠానం నియమించింది. రాష్ట్రఅధ్యక్షుడిగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నియమించారు. ఉపాధ్యక్షుడిగా కొండా రాజీవ్‌గాంధీ, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. 64 మందితో నూతన కమిటీని నియమించారు.

రాష్ట్ర బాగుకోసం జగన్ ప్రభుత్వాన్ని సాగనంపాలి: జగదీశ్

విశాలాంధ్ర-అనంతపురంఅర్బన్: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే మార్చాల్సింది వైసీపీ ఇన్‌చార్జ్ లను కాదని... వైసీపీ ప్రభుత్వాన్ని మార్చి జగన్‌ను ఇంటికి పంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ విమర్శించారు. జగన్ అవినీతి పాలనపై ప్రజలందరూ తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులనందరినీ మార్చినా వైసీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం జరగదని మండిపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి గాలికొదిలేశారని... కొత్త పరిశ్రమలు రాకుండా, ఉన్న పరిశ్రమలు సైతం ఇతర రాష్ట్రాలకు తరలిపోయేలా చేసి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అక్రమ మద్యం, మైనింగ్, ఇసుక,ఎర్ర మట్టి మాఫియాలను సైతం పెంచి పోషించిన జగన్ చర్యల పట్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఘోరంగా ఓడించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ జిమ్మిక్కులు పనిచేయవని జగదీశ్ ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో ఓ వైపు వరదలు, మరో వైపు కరువు తాండవిస్తుంటే వైసీపీ ఎంపీలు పార్లమెంట్‌లో రాష్ట్రానికి వచ్చిన విపత్తుపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితిని కనీసం ప్రధాని దృష్టికి కూడా తీసుకెళ్లలేక పోయారని ధ్వజమెత్తారు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టడంలోనూ సీఎం జగన్ ఘోరంగా విఫలమయ్యాడని విమర్శించారు. జగన్ అవినీతి పాలనకు కేవలం మూడు మాసాలు మాత్రమే గడువు ఉందని... ఇప్పటికైనా తమ పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకునేలా రైతులకు తక్షణమే రుణమాఫీ చేస్తూ పంట నష్టపరిహారం ఇవ్వాలని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందించాలని డిమాండ్ చేశారు.

సీఆర్ మీడియా అకాడమీ డిప్లొమో ఇన్ జర్నలిజం కోర్సు ఫలితాల విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఆర్ మీడియా అకాడమీ నిర్వహించిన డిప్లొమో ఇన్ జర్నలిజం కోర్సు పరీక్షా ఫలితాలను మంగళవారం వెల్లడించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉపకులపతి ప్రొఫెసర్ రాజశేఖర్, సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ ఫలితాలను విడుదల చేశారు. ఆరు నెలల వ్యవధి కలిగిన డిప్లొమో ఇన్ జర్నలిజం కోర్సును వర్కింగ్ జర్నలిస్టులు, జర్నలిజంలో అభిరుచి ఉన్న ఇతరులకు సీఆర్ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన విషయం విదితమే. ఈ సందర్భంగా కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ డిప్లొమో కోర్సుల్లో 302 మంది దరఖాస్తు చేసుకోగా, విశ్వవిద్యాలయం నిర్వహించిన పరీక్షలకు 228 హాజరయ్యారని, వారిలో 178 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఇందులో 39 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని, మొదటి శ్రేణిలో 103 మంది, ద్వితీయ శ్రేణిలో 28 మంది, తృతీయ శ్రేణిలో 8 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుతో పాటు సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర తిలక్ అభినందించారు. ఈ పరీక్షల్లో కొప్పుల అన్వేషి 400 మార్కులకు 315 మార్కులను సాధించి 78.5 శాతంతో మొదటి ర్యాంకు సాధించినట్లు వివరించారు. గంధగతెర సుధాకర్ 310 మార్కులకు 77.5 శాతంతో ద్వితీయ ర్యాంకును, వెలమల ఈశ్వరరావు 309 మార్కులకు 77.25 శాతంతో తృతీయ ర్యాంకును సాధించారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని ఆరు పరీక్షా కేంద్రాల్లో ఈ ఏడాది అక్టోబరు 26 నుంచి 30 వరకు పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.కరుణ, జర్నలిజం శాఖ అధిపతి డాక్టర్ జి.అనిత, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.నర్సారెడ్డి, వివిధ విభాగాల అధికారులు ప్రకాశరావు, బి.నర్సారెడ్డి, ఎల్‌వీకే రెడ్డి, ఎం.బాలగంగాధర తిలక్, శ్రీనివాస్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్1, 2 అభ్యర్థుల వయో పరిమితి పెంచాలి

పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: గ్రూప్-1, 2 ఉద్యోగాలకు సంబంధించి ఏపీపీఎస్సీ ద్వారా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అభ్యర్థుల వయోపరిమితి 42 నుంచి 45 సంవత్సరాలకు పెంచాలని ఏఐవైఎఫ్ ఏపీ అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్‌చేశారు. తాజా వయో పరిమితి వల్ల పరీక్షలు రాసే అవకాశాన్ని వందల మంది కోల్పోతారని మంగళవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. గ్రూప్-2 ఉద్యోగాలకు ఇదే మొదటి నోటిఫికేషన్ కావడంతో నిరుద్యోగుల ఇబ్బందులు గమనించి వయోపరితిని 44 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో గరిష్ట పరిమితి 44 సంవత్సరాలుగా ఉందని గుర్తుచేశారు. నాలుగేళ్ల నుంచి నోటిఫికేషన్స్ కోసం అభ్యర్థులు నిరీక్షించారని, ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడిందని రాజేంద్ర బాబు వ్యాఖ్యానించారు.

సంపాదకీయం

మోదీ చదరంగంలో కొత్త పావులు

చదరంగంలో పావులు కదపడం చిన్న పనేం కాదు. డిసెంబర్ మూడున మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. తెలంగాణ మినహాయిస్తే మిగతా మూడు రాష్ట్రాలలో బీజేపీ భారీ విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 స్థానాలు ఉంటే బీజేపీ 54 సీట్లు సాధించింది. మధ్యప్రదేశ్ లో 230 సీట్లు ఉంటే బీజేపీ 163 స్థానాలు దక్కించుకుంది. రాజస్థాన్‌లో ఉన్న 200 స్థానాలలో బీజేపీ 115 సీట్లలో గెలుపొందింది. ఇంతకు ముందు రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉండేవి. ఆ తరువాత కాంగ్రెస్ నుంచి ఫిరాయింపులతో మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఎన్నికలలో అక్కడ అధికారం నిలబెట్టుకోగలిగింది. కాంగ్రెస్ చేతిలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కూడా స్వాధీనం చేసుకుంది. అయితే ఈ రాష్ట్రాలలో ముఖ్యమంత్రులను ఎంపిక చేయడానికి మాత్రం దాదాపు పది రోజులు పట్టింది. మొదట ఛత్తీస్‌గఢ్, తరవాత మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రులను ఎంపిక చేసింది. రాజస్థాన్ ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎంపిక చేయడం మంగళవారానికి కానీ కుదరలేదు. మోదీ లాంటి బలమైన నాయకుడున్న బీజేపీకి ఇంత సమయం ఎందుకు పట్టిందన్నది మాత్రం పెద్ద ప్రశ్నే. ఈ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఎంపిక చేయడంలో మోదీ వినూత్నమైన పద్ధతి అనుసరించారు. ఊహాగానాలన్నింటినీ పటాపంచలు చేసి అంతకు మునుపు ఎన్నడూ ప్రస్తావనలో కూడా లేని వారిని ముఖ్యమంత్రులను చేశారు. కుల సమీకరణలను తేల్చడానికి ఇంత సమయం పట్టిందనుకోవాలి. ఛతీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా గిరిజనుడైన విష్ణుదేవ్ సాయిని ఎంపిక చేశారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ ను, రాజస్థాన్ ముఖ్యమంత్రిగా భజన్‌లాల్ శర్మను ఎంపిక చేశారు. మధ్యప్రదేశ్‌కు మోహన్ యాదవ్‌ను ఎంపిక చేశారు. వీరిద్దరూ అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులే. ముఖ్యమంత్రి ఎంపిక చాలా జటిలమైన రాజస్థాన్‌లో మాత్రం మొదటిసారి ఎన్నికైన భజన్ లాల్ శర్మకు అవకాశం ఇచ్చారు. రాజస్థాన్‌లో దియా కుమారి, ప్రేంచంద్ బైర్వాను ఉప ముఖ్యమంత్రులుగా నియమించారు. వాసుదేవ్ దేవ్నానీని స్పీకర్‌గా నియమించారు. మధ్యప్రదేశ్‌లో మోహన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించడం వెనక ఓ విశేషం ఉంది. బీహార్, ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్షాలు యాదవుల ఆధారంగా రాజకీయాలు నడుపుతున్నారని ఇన్నాళ్లు నానా యాగీ చేసిన బీజేపీ అగ్ర నాయకులు చివరకు యాదవ్‌కే ముఖ్యమంత్రి బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. అంటే ప్రతిపక్షాలు ఇతర వెనుకబడిన కులాల ఆధారంగా రాజకీయాలు నడుపుతున్నారని ప్రచారం చేసిన బీజేపీ చివరకు మోహన్ యాదవ్ ను ముఖ్యమంత్రిని చేయడం ద్వారా ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్‌కు, బిహార్‌లో తేజస్వీ యాదవ్‌కు సవాలు విసిరారన్న మాట. ఎంపిక చేసిన తీరులో మోదీ ముద్ర బలంగా ఉంది. ఎప్పుడూ ఎన్నికల వ్యవహారంలోనే మునిగి తేలే మోదీ 2024 లోకసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పావులు జాగ్రత్తగా కదిపారు. మధ్యప్రదేశ్‌లో జగదీశ్ దేవ్డాను, రాజేంద్ర శుక్లాను ఉపముఖ్యమంత్రులను చేశారు. మొన్నటి దాకా కేంద్రంలో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న నరేంద్ర సింగ్ తోమార్‌కు స్పీకర్ పదవితో సరిపెట్టుకొమ్మని సూచించారు. మోదీ ఎంపిక చేసిన ముగ్గురు ముఖ్యమంత్రులూ ఆర్.ఎస్.ఎస్. కుదురు నుంచి వచ్చిన వారే. అంటే హిందుత్వ ఎజెండాను ముఖ్యమంత్రుల ఎంపికలో కూడా పకడ్బందీగా అమలు చేశారు.

ముఖ్యమంత్రుల ఎంపికలో మోదీ జాగ్రత్తగా అనుసరించిన సూత్రం ఏమిటంటే ఆ రాష్ట్రాలలో బలమైన నాయకులందరినీ పక్కన పెట్టడం. కులాల సమతూకం ఉండేట్టు జాగ్రత్త పడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనుల జనాభా 32 శాతం ఉంటుంది. అందుకని గిరిజనుడైన విష్ణుదేవ్ సాయిని ముఖ్యమంత్రిని చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ గెలిచి తీరుతుందన్న అంచనాలన్నీ తారుమారు కావడానికి 2018లో అధికారంలోకి వచ్చిన తరవాత కాంగ్రెస్ గిరిజనులను పట్టించుకోలేదన్న విశ్లేషణలు విరివిగా వచ్చాయి. గిరిజనుడికి ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించడంవల్ల ఈ అపవాదు రాకుండా మోదీ జాగ్రత్త పడ్డారు. ఇతర వెనుకబడిన వర్గాల వారికి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నా ఆ పని చేయకుండా మోదీ గిరిజనుడిని పట్టాభిషిక్తుడిని చేయాలనుకోవడంలో 2024 ఎన్నికల మీద దృష్టి ఉండడంవల్లే. మధ్యప్రదేశ్‌లో యాదవ్‌ను ముఖ్యమత్రిని చేయడం దళితుడైన జగదీశ్ దేవ్డాను, బ్రాహ్మణుడైన రాజేంద్ర శుక్లాను ఉప ముఖ్యమంత్రిగా నియమించడంలోనూ 2024 లోకసభ ఎన్నికల కూడికలు తీసివేతలే పని చేశాయి. నరేంద్ర తోమార్ కు కేంద్రంలో మంత్రిపదవి ఊడింది కనక ఆయనను ఓదార్చడానికి స్పీకర్ పదవి కట్టబెట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న 26 ఎస్టీ స్థానాలలో బీజేపీ 22 సీట్లు సాధించింది కనక ఎస్టీ అభ్యర్థినే ముఖ్యమంత్రిని చేయాల్సి వచ్చింది. మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాలు ఛతీస్‌గఢ్‌కు పొరుగు రాష్ట్రాలే. అక్కడా గిరిజనులు 22 నుంచి 26 శాతం ఉంటారు. ఆ పక్కనే ఉన్న ఒడిసాలో కూడా గిరిజనులు 23 శాతం ఉంటారు. వెరసి ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి స్థానాన్ని గిరిజనుడికి అప్పగించడంద్వారా పొరుగు రాష్ట్రాలలోని ఎస్టీలకు మోదీ స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఎస్టీ అయిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేశామని బీజేపీ ఇప్పటికీ టముకు వేసుకునే ఈ రాష్ట్రాలలోని గిరిజనులకు మోదీ పెద్ద వలే వేశారు. మధ్యప్రదేశ్‌లో 47 అసెంబ్లీ సీట్లు కేటాయిస్తే అందులో బీజేపీ 24 చోట్ల విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్, బిహార్‌లో యాదవ రాజకీయాలు బలంగా ఉంటాయి. ఈ రాష్ట్రాలలో 120 లోకసభ స్థానాలు ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో ప్రతిపక్షాలు యాదవులకు మద్దతిస్తాయి కనక మధ్యప్రదేశ్‌లో యాదవుడికి ముఖ్యమంత్రి పీఠం అప్పగించి తాము యాదవులను విస్మరించడం లేదని మోదీ చెప్పదలచుకున్నారు. ఎంపిక చేసిన ముగ్గురు మంత్రులు సాపేక్షికంగా చిన్న వయసు వారి కిందే లెక్క. అందువల్ల కొత్త తరం నాయకులను రంగంలోకి దించడం కూడా మోదీ లక్ష్యం అయి ఉంటుంది. అన్నీ కొత్త ముఖాలను ప్రవేశ పెట్టడం ద్వారా శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధరా రాజే సింధియా, డా. రమణ్ సింగ్‌ను మోదీ వాటంగా తప్పించారు. అనుభవజ్ఞుడైన శివరాజ్ సింగ్ చౌహాన్ లాంటి వారు తనకు ప్రత్యర్థులవుతారేమోనన్న భయం మోదీని చాలా కాలంగా వెంటాడుతోంది. శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఏ బాధ్యతలు అప్పగిస్తారో తెలియదు. కానీ ఆయన మరణమైనా సమ్మతమే కానీ కేంద్రానికి మాత్రం వెళ్లను అంటున్నారు. లోకసభ ఎన్నికల సమయంలో వసుంధరా రాజే అనుసరించే వ్యూహాన్నిబట్టి ఆమె రాజకీయ భవిష్యత్తు ఉంటుంది. ఇప్పటివరకు ఉన్న పరిణామాలను బట్టి చూస్తే ఆమె రాజకీయ జీవితానికి తెరపడ్డట్టే.

చౌహాన్‌కు మోదీ షాక్

ఎల్ఎస్ హర్దేనియా

మధ్యప్రదేశ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కి షాక్ ఇవ్వడమేకాక, మరో ఎత్తుగడపన్నారు. మోహన్ యాదవ్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించి ఆశ్చర్యం కలిగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురు కేంద్ర మంత్రులు, నలుగురు ఎంపీలను రాజీనామా చేయించి అసెంబ్లీకి పోటీచేయించి మోదీ ఆశ్చర్యపరచారు. ఇప్పుడు కూడా కొత్త ఎత్తుగడపన్ని యాదవ్ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేశారు. చౌహాన్ మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. చివరిసారిగా ముఖ్యమంత్రిని చేస్తారనుకున్న చౌహాన్ కలలు కల్లలు అయ్యాయి. తాజా ఎన్నికలకు కూడా ఆయన అవిశ్రాంతంగా ప్రచారం సాగించారు. చౌహాన్ బదులుగా మరొకరిని ముఖ్యమంత్రిని చేయవచ్చునన్న ఊహాగానాలు ఉన్నాయి. మరోవేపు చౌహాన్‌నే ముఖ్యమంత్రిని చేస్తారన్న ఆశలుకూడా ఉన్నాయి. తాను ముఖ్యమంత్రి పదవి అలంకరిస్తానని బహుశ మోహన్ యాదవ్ ఏనాడూ అనుకోలేదు. ఆయన ఉజ్జయిని నుంచి మూడుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. గతంలో ఆయన ఏబీవీపీ నాయకుడిగా పనిచేశారు. ఆశ్చర్యకరంగా మోహన్‌యాదవ్ మెడలో వరమాల పడింది. శివరాజ్‌సింగ్‌చౌహాన్ 11వతేదీ సాయంత్రమే గవర్నర్‌కు రాజీనామా పత్రం అందచేశారు.

2024లో లోకసభ ఎన్నికల్లోనూ హిందీ రాష్ట్రాలలో మోదీ రకరకాల ఎత్తుగడలు పన్నేందుకు నిర్ణయించుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ ముఖ్యమంత్రిని గిరిజన వర్గం నుంచి ఎంపికచేసి మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌ను ఎన్నికల వరకే ఉపయోగించుకున్నారు. మహిళను ముఖ్యమంత్రిగా చేస్తానన్న వాగ్దానాన్ని మోదీ ఉల్లంఘించారు. రాజస్థాన్‌లోనూ వసుంధర రాజే సింధియాను ముఖ్యమంత్రిగా ఎంపిక చేయకుండా ఆమెకు గట్టి షాక్ ఇచ్చారు. ప్రస్తుతం ఎంపికచేసిన ముఖ్యమంత్రి పట్ల వసుంధర రాజే తీవ్ర ఆగ్రహంతో, వ్యతిరేకతతో ఉన్నారు. తాజాగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి లోకసభ ఎన్నికలలో ఓబీసీ యాదవుల ఓట్లను వీలైనన్ని ఎక్కువగా రాబట్టేందుకే నూతన వ్యక్తిని ఎంపిక చేశారు. రానున్న లోకసభ ఎన్నికల్లో గెలుపు అవకాశాలున్న అభ్యర్థినే ఎంపిక చేస్తారని మోహన్ యాదవ్‌ను పోటీచేయిస్తే గెలవకపోవచ్చునని మోదీ అంచనా వేశారని తెలుస్తోంది. మోహన్‌యాదవ్‌ను ముఖ్యమంత్రి పదవికి చౌహాన్ ప్రతిపాదించారు. 163మంది యాదవ్‌కు ఆమోదముద్ర వేశారు. యాదవ్ ఏనాడూ తాను ముఖ్యమంత్రి అవుతానని అనుకోకపోగా తన పేరు చెప్పినప్పుడు నమ్మలేకపోయానన్నారు. చౌహాన్ మంత్రివర్గంలో యాదవ్ ఉన్నతస్థాయి విద్యామంత్రిగా పనిచేశారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. తొలి నుంచి ఆయన ఆర్ఎస్ఎస్‌లో కీలకంగా పనిచేశారు. శివరాజ్‌సింగ్ మంత్రివర్గంలో మూడున్నర సంవత్సరాలు పనిచేశారు. రాష్ట్రం మొత్తంలో 52శాతం ఓబీసీ జనాభా ఉన్నారు. ఈ రాష్ట్రంలో ఓబీసీ ముఖ్యమంత్రులు ఎక్కువగా ఉన్నారు. 2003లో ఉమాభారతి, 2004లో బాబుల్‌గౌడ్, 2005లో శివరాజ్‌సింగ్ ముఖ్యమంత్రి పదవిని స్వీకరించి దీర్ఘకాలం కొనసాగారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా యాదవ్‌ని ఎంపిక చేయడంపై రాజస్తాన్‌లో కూడా యాదవులపై ప్రభావం ఉంటుందని బీజేపీ భావిస్తోంది. మధ్యప్రదేశ్‌కంటే రాజస్తాన్‌లో హిందూత్వ భావజాలం ఎక్కువగా ఉంది. రాజస్తాన్‌లో అశోక్ గెహ్లాత్ ప్రభుత్వం ప్రజలకు అనేక ప్రయోజనాలు సమకూర్చారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆరోగ్యపథకాన్ని ప్రవేశపెట్టి చట్టబద్ధం కూడా చేశారు. మైనారిటీలకు అనుగుణంగా సెక్యులర్ భావాలతో ఆయన ప్రభుత్వాన్ని నడిపించారు. ముస్లిం మైనారిటీలకుసైతం ప్రయోజనాలు కల్పించారు. దేశం నడిబొడ్డున ఉన్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా యాదవ్‌ను ఎన్నుకున్నట్లయితే దాని ప్రభావం ఉత్తరప్రదేశ్, బిహార్, హర్యానా రాష్ట్రాల్లో 2024 లోకసభ ఎన్నికల్లో ప్రయోజనం పొందవచ్చునని మోదీ వ్యూహం పన్నారు. శివరాజ్‌సింగ్ పాలనలో మధ్యప్రదేశ్ వెనుకబడిన రాష్ట్రంగా తయారైంది. చౌహాన్ 16.5 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో యాదవుల జనాభా చాలా ఎక్కువగా ఉంది. అయితే ఈ రాష్ట్రాలలో యాదవులు కాంగ్రెస్‌కు చాలా అనుకూలంగా కొనసాగుతున్నారు. వాళ్ల ఓట్లను చీల్చి ప్రయోజనం పొందేందుకే ఈ ఎత్తుగడ వేశారు. అలాగే అఖిలేష్‌యాదవ్ పార్టీతోనూ ఒక వర్గం యాదవులు సన్నిహితంగా ఉంటారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సమాజ్‌వాది పార్టీకి సీట్లు కేటాయించకుండా ఆయనను అవమానించారన్న కోపం యాదవులలో ఏర్పడిందని చెబుతున్నారు. ఉజ్జయిని నుంచి ముఖ్యమంత్రిని ఎంపికచేసిన మొదటి వ్యక్తి యాదవ్ కాదు. అంతక్రితం 1975లో ఇందిరాగాంధీ కూడా ఇదే పనిచేశారు. ఎన్నికల సందర్భంగా ఆనాటి ముఖ్యమంత్రి ఎస్‌సి శుక్లాను పదవినుండి ఇందిరాగాంధీ తొలగించారు. ఆయనను తొలగించి ఉజ్జయినికి చెందిన నాయకుడు పీసీ సేథీని ముఖ్యమంత్రిని చేశారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా యాదవ్‌ను ఎంపిక చేయడంతోపాటు ఉప ముఖ్యమంత్రులుగా జగదీష్ దేవ్డా, రాజేంద్ర శుక్లాలను నియమించారు. ఇద్దరు ఉపముఖ్యమంత్రులుగా బీజేపీ ఎంపికచేయడం బహుశా ఇదే మొదటిసారి. స్పీకరగా నరేంద్రసింగ్ తోమర్‌ను ఎంపికచేశారు. జగదీష్ దేవ్డా (66) మలహర్‌గర్ నుంచి 9వసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఎస్‌సిల నుండి ఎన్నికైన ఒకేఒక వ్యక్తి. మరో ఉపముఖ్యమంత్రి రాజేంద్రశుక్లా రేవా నుండి ఐదుసార్లు ఎన్నికయ్యారు. ఈ నియోజకవర్గంలో బ్రాహ్మణ జనాభా గణనీయంగా ఉన్నారు. ఇక్కడ ఎన్నికల్లో బిఎస్‌పి పైన మూడుసార్లు గెలుపొందారు. ముఖ్యమంత్రి పదవి స్వీకరించిన ఎంఎల్‌ఏల గెలుపుసత్తాను అంచనావేసిన తర్వాతనే పదవులకు ఎంపిక చేస్తున్నారు.

తుపాను, కరువు బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలి



కె.వి.వి. ప్రసాద్

రాష్ట్రంలో 2023-24 వ్యవసాయ సీజన్‌లో వాతావరణ స్థితి చిత్రవిచిత్రంగా ఉంది. వానలు కావాలని మొక్కితే వడగండ్ల వాన కురిసి పంటలు ధ్వంసమైన చందంగా ఒకే ఏడాది కరువు, మిచౌంగ్ తుపానులతో రైతన్నలు అతలాకుతలమయ్యారు. తుపాను సృష్టించిన విధ్వంసంతో అన్నమయ్య జిల్లా మొదలుకొని శ్రీకాకుళం జిల్లా వరకు రాయలసీమ, కోస్తా తీర ప్రాంత జిల్లాల్లో సుమారు 20 లక్షల ఎకరాలకు పైగా పంటనష్టం సంభవించింది. కోత దశకు వచ్చిన వరి పంట లక్షలాది ఎకరాలు నీట మునిగింది. కోసిన పంట, ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యాయి. పత్తి, మిర్చి. మొక్కజొన్న, పొగాకు, శనగ, కూరగాయపంటలు, అరటి, బొప్పాయి, పూలతోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నష్టాన్ని తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నిస్తున్నది. 1,47,795 హెక్టార్లలో వరి, 31498 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బ తిన్నట్లు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ప్రకటించారు. తుపాను తీరం దాటి పదిరోజులు కావస్తున్నా ఇంత వరకు పంట నష్టం ఎన్యూమరేషన్ పూర్తి స్థాయిలో జరుగలేదు. ప్రాథమిక అంచనా పేరుతో ప్రభుత్వం నష్టం అంచనాలు వెల్లడించిన తీరు చూస్తే తరువాత క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది సైతం అందుకనుగుణంగా గణాంకాలు సిద్ధం చేసి నష్టాన్ని తక్కువ చూపి సర్దుకుంటారనే భావన రైతాంగంలో ఉంది.

రాష్ట్రంలో రైతాంగం పండించిన 135 రకాల పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ జరుగుతున్నట్లు ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంటు యంత్రాంగం చెబుతోంది. అయితే ప్రభుత్వం నోటిఫై చేసిన 24 పంటలకు మాత్రమే పంటల బీమా జరుగుతుంది. పామాయిల్, చెరుకుతోపాటు వివిధ రకాల పూల రకాలు, పండ్లు రకాలు, కూరగాయలకు బీమా వర్తించదు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేది నామమాత్రం. వీరికి హెక్టార్‌కు 15,000 రూపాయల నష్ట పరిహారం ఇస్తున్నట్లు ప్రకటించారు. పెరిగిన వ్యవసాయ ఖర్చుల ప్రకారం ఎకరాకు 40వేలుకు పైగా ఖర్చు అవుతోందనీ ఇలాంటి విపత్తులకు సంభవించి పంట నష్టపోతే రైతుకు మిగిలేది శూన్యమని వారు వాపోతున్నారు. అందువల్లనే ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా సీ2+50 ప్రకారం మద్దతు ధరలు నిర్ణయించాలని ఎం.ఎస్ సామినాథన్ కమిషన్ సిఫార్సు చేసింది. పంటలు నష్టపోయిన సందర్భాల్లో నష్టపరిహారం హెక్టారుకు 25,000 వుండాలని 2012లో కేంద్రప్రభుత్వం నియమించిన భూపేంద్ర హుడా కమిటి సిఫార్సు చేసింది. 13 సంవత్సరాల అనంతరం కూడా సిఫార్సులు అమలు కాకపోవటం సిగ్గుచేటు. మన రాష్ట్ర ప్రభుత్వం హెక్టార్ వరికి 15 వేలు నష్టపరిహారం ఇస్తున్నట్లు గొప్పగా చెప్పుకుంటున్నది. మరో పక్క పంట నష్టం తగ్గించేందుకు అవసరమైనచర్య లేవు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హయాంలో సాగునీటి,, మురుగునీటి కాలువల మరమ్మతులు లేవు. చివరి భూముల రైతాంగానికి సాగునీరందిక, తుపాను, భారీవర్షాలు, వరదలతో నీటి మునిగిన పంట భూముల్లో నీరు బయటకు పోక పంట నీటిపాలై రైతులు పడుతున్న వ్యధలు వర్ణనాతీతం.

ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తింగా తీవ్ర వర్షాభావ స్థితి నెలకొంది. 20 జిల్లాలకు చెందిన 470 మండలాల్లో వర్షాభావం వుంది. దాదాపు 466 మండలాల్లో డ్రైస్పెల్స్ ఏర్పడ్డాయి. డిసెంబర్ 7 వతేదీ నాటికీ సుమారు 307 మండలాల్లో వర్షాభావ స్థితి ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడంతో పనులులేక రాయలసీమ ప్రాంతం పదుల వేల సంఖ్యలో కుటుంబాలు వలసవెళ్లాయి. మిచౌంగ్ తుపాను ప్రభావంతో అనేక జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో పంట నీట మునిగి చేతికి అందివచ్చిన పంటలు సర్వనాశనమైయేంత భారీ వర్షాలు కురిసిన అనంతరం కూడా ఇంకా 16 జిల్లాల్లో సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదైదంటే రాష్ట్రాన్ని కరువు వెంటాడుతోందన్న వాస్తవం విస్మరించలేనిది. రాష్ట్రంలో కరువు, తుపానుల పరిస్థితి అద్దంలా కనిపిస్తుంటే ప్రభుత్వం కళ్లుండి చూడలేనిదిగా ఉంది. కరువు తీవ్రతను కేంద్రానికి సకాలంలో నివేదించి, కేంద్ర బృందాన్ని రప్పించి, కరువు పీడిత ప్రజలను, రైతాంగాన్ని, గ్రామాల్లో పేదలను ఆదుకుందామన్నా విజ్ఞత రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. మిచౌంగ్ తుపాను విధ్వంసంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి.

కరువు కాటు, తుపానుపోటుతో తీవ్రంగా నష్టపోయిన రైతులు, కౌలు రైతులు, పేద వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులను ఆదుకునేందుకు చిత్తశుద్ధి ప్రదర్శించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 9న రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. డిసెంబరు 14 (గురువారం) రాష్ట్రంలోని 26 జిల్లాలో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని నిర్ణయించి, కార్యక్రమాన్ని రూపొందించి, తీర్మానాలను ఆమోదించింది. రైతులు, కౌలు, రైతులు గ్రామీణ పేదలందరు ధర్నాల్లో పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తక్షణ సాయం అందించేలా ఒత్తిడి తేవాల్సి ఉంది.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

సెల్: 9505137333

డిమాండ్లు:-

- తుపాను, కరువు నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్రం తక్షణ సాయంగా రూ.1000 కోట్లు పూర్తి సాయంగా రూ.10 వేల కోట్లు ప్రకటించాలి.
- నష్టపోయిన వంటలను గుర్తించి అక్రమాలు జరుగకుండా ఎన్యూమరేషన్ చేయాలి. కౌలు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధితోపాటు రైతు సంఘాల బాధ్యులను ఎన్యూమరేషన్ కమిటీలో వేయాలి.
- రాష్ట్రంలోని తక్కువ వర్షపాతం నమోదైన 470 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి.
- నష్టపోయిన ఆహార వంటలకు ఎకరాకు రూ.30 వేలు, వాణిజ్య వంటలకు రూ. 50 వేలు, ఉద్యాన వంటలకు రూ.75వేలు నష్టపరిహారం ఇవ్వాలి. భూపేంద్ర హుడా కమిటీ సిఫార్సుల ప్రకారం, ప్రస్తుతం పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా నష్టపరిహారం నిర్ణయించాలి.
- అన్ని వంటలకు వంటల బీమా వర్తింపచేయాలి..
- రైతులు, కౌలు రైతుల అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలి. రెండవ వంట వేసుకునేందుకు అవసరమైన రుణాలు వరి, మినుము తదితర విత్తనాలు ఉచితంగా అందించాలి.
- సాగునీటి, మురుగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టాలి.
- తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని పత్తి, మిర్చి వంటలను ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలి.
- వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల వలసల నివారణకు 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 కూలీగా ఇవ్వాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల అన్ని రకాల ఫీజులు రద్దుచేయాలి.
- ఏపీ డిజాస్టర్ మేనేజ్ మెంట్ విభాగాన్ని హోంశాఖ నుంచి రెవెన్యూ శాఖకు అప్పగించాలి.
- ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులైన రైతులకు, కౌలురైతులకు నష్టపరిహారం ఇవ్వాలి.

అరుణమయ చరిత అమరం

మోదుమూడి మురళీకృష్ణ

జీవితాన్ని తనకోసం, తన కుటుంబం కోసం కాక, సమాజం కోసం, అణగారిన ప్రజల కోసం, ఎన్ని ఇక్కట్లు, నిర్బంధాలు, సవాళ్లు ఎదురైనా నిబద్ధతతో నిలబడటం కమ్యూనిస్టు ఆశయ పథగామికి మాత్రమే సాధ్యమయ్యే ఆచరణ. చరిత్రను ఒకసారి తిరగేస్తే పరుల కోసం, ప్రజల కోసం, వారి హక్కుల కోసం, సౌఖ్యం కోసం నిస్వార్థంగా జీవితాలను త్యాగం చేసిన వారిని కమ్యూనిస్టు ఉద్యమంలో ఎంతో మందిని మనం చూడగలుగుతాం. కేవలం చరిత్రలోనే కాదు, నేటి వర్తమానంలో కూడా, ప్రపంచీకరణ, వస్తు వ్యామోహ, వినియోగదారీ, ద్రవ్యభ్రమల ప్రపంచంలోనూ కమ్యూనిస్టుగా నిలబడటం మరింత కష్టమైన సమయంలోనూ నిబద్ధంగా త్యాగాలతో పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులు ఆదర్శనీయంగా వున్నారు. కమ్యూనిస్టు ఉద్యమ ఒరవడి అలాంటిది. అలాంటి వారందరికీ కమ్యూనిస్టు యోధ నీలం రాజశేఖరరెడ్డి జీవితం మహోన్నత ప్రేరణ. స్వాతంత్ర్య సమరయోధునిగా, కమ్యూనిస్టు నాయకునిగా ఆయన సేవలు నిరూపమానం. చరిత్రకు ఘనమైన జీవితాన్ని అందించిన అమరుడు ఆయన. ఉత్తమమైన, ఉన్నతమైన మానవ జీవితాన్ని ఎలా జీవించాలో ఆ కామ్రేడ్ చరిత్రను చూసి తెలుసుకోవచ్చు. సీటు కోసమో, ఓటు కోసమో, పదవి కోసమో, పైస కోసమో మాటను, బాటనూ మార్చుకునే నేటి రాజకీయ విన్యాసాల వేళలో అంకిత భావం, నిబద్ధమైన ఆశయ ప్రస్థానంగల నీలం రాజశేఖరరెడ్డి స్మరణ కారుచీకట్లో కాంతి రేఖలా కనపడు తుంది. నిరంతర అధ్యయనశీలి. విశ్లేషణాత్మక బోధకుడు. కమ్యూనిస్టు ఉద్యమకారుడు. సైద్ధాంతిక అధ్యాపకులకు ఆచార్యుడు ఆయన. "మానవ సంపదలలో అత్యంత ప్రియమైనది జీవితం! అలాంటి జీవితాన్ని జీవించే అవకాశం మనిషికి ఒక్కసారి మాత్రమే లభిస్తుంది. ప్రతి మానవుడు తన జీవితాన్ని మానవజాతి విముక్తి కోసం ఉపయోగించానని సంతృప్తి చెందగల జీవితాన్ని గడపాలి" అన్న లెనిన్ మాటలు నీలం రాజశేఖర రెడ్డికి ఆదర్శం. అమరజీవులు చంద్ర రాజేశ్వరరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ ట్రస్టుల అధ్యక్షునిగా పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా అనంతపురం జిల్లా ప్రజల మదిలో స్థానం సంపాదించుకున్నారు. ఆయన 1994 డిసెంబర్ 13న తుది శ్వాస విడిచాడు. ఆయన స్మారక చిహ్నంగా హైదరాబాద్ శివార్లలోని కొండాపూర్‌లోని మార్క్సిస్ట్ అధ్యయనాలకోసం చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన పరిశోధనా కేంద్రానికి "నీలం రాజశేఖర రెడ్డి పరిశోధనా కేంద్రం" అని నామకరణం చేశారు.



అనంతపురం జిల్లా గూటిమండలం ఇల్లూరు గ్రామంలో భూస్వామ్య కుటుంబంలో 1918లో నీలం రాజశేఖరరెడ్డి జన్మించారు. చిన్నపరెడ్డి, సుబ్బమ్మ అయన తల్లిదండ్రులు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఆయనకు సోదరుడు. రాజకీయంగా వారిది కాంగ్రెస్ పార్టీకి చెందిన కుటుంబం. రాజశేఖరరెడ్డిని, ఆయన బావమరిది తరిమెల నాగిరెడ్డిని స్వాతంత్ర్య సమరయోధుడు కల్లూరు సుబ్బారావు బెనారస్ నేషనల్ కాలేజీలో చేర్పించారు. ఉన్నత చదువు కోసం బెనారస్ విశ్వవిద్యాలయానికి వెళ్లిన నీలం రాజశేఖరరెడ్డిని సుభాస్ చంద్రబోసు, ఎం.ఎన్.రాయ్, పి.భట్టాచార్య, బాట్లీవాలా తదితరుల ఉపన్యాసాలు ఆకర్షించాయి. కమ్యూనిస్టు భావజాలానికి ప్రభావితం అయ్యారు. 1938 డిసెంబరులో బెనారస్‌లో భారత కమ్యూనిస్టుపార్టీ సభ్యులయ్యారు. బెనారస్ విశ్వవిద్యాలయంపార్టీ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. అంతకు ముందే వేసవి సెలవులకు అనంతపురం వెళ్లినప్పుడు ఐదుకల్లు సదాశివన్ ఆధ్వర్యంలో యువకులకు, విద్యార్థులకు నిర్వహించే అధ్యయన తరగతుల్లో అనేక అంశాలను బోధించేవారు. ఆవిధంగా నీలం రాజశేఖరరెడ్డి బోధకుడిగానే అనంతపురం జిల్లాలో రాజకీయరంగ ప్రవేశం చేశారు. 1939 మే నెలలో అనంతపురం జిల్లా యువజన సంఘం వేసంగి రాజకీయ పాఠశాల హిందూపురంలో హైస్కూలులో నెలరోజులపాటు జరిగింది. పాఠశాలకు పీసీ జోషి, పుచ్చలపల్లి సుందరయ్య, పి.రామమూర్తి, ఆచార్య రంగా, హరి సర్వోత్తమరావు, శనివారపు సుబ్బారావు, బెజవాడ గోపాలరెడ్డి, కాళేశ్వరరావు, నాగిరెడ్డి, సదాశివన్‌తోపాటు రాజశేఖరరెడ్డి హాజరై అనేక అంశాలపై బోధించారు. ఆయన మూడేళ్లపాటు రహస్య జీవితం గడిపారు. 1941-42లో రెండవ ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకించినందుకు, ఆగ్రా సెంట్రల్ జైలు, బెనారస్ జిల్లా జైలు, చెరైలి సెంట్రల్ జైలు, రాజమండ్రిలో యుద్ధ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేసినందుకు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష అనుభవించారు. 1952లో పోలీసులు ఆయన ఆస్తులను జప్తు చేశారు. 1943 జనవరిలో భారత కమ్యూనిస్టు పార్టీ అనంతపురం జిల్లా ప్రథమ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1946లో అనంతపురం జిల్లా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర అనే పుస్తకాన్ని రాశారు. 1961 జూన్ 11 నుండి 1971 సెప్టెంబరు 27 వరకు కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం పార్టీ కేంద్ర కమిటి బాధ్యతలోకి వెళ్లారు. అక్కడ కూడా రాజశేఖరరెడ్డి ఇతర కార్యకలాపాలతోపాటు పార్టీ అధ్యయన విభాగంలో పనిచేశారు. కార్యకర్తలు, నాయకులకు సైద్ధాంతిక శిక్షణ వ్యవహారంలో కేంద్రవిభాగానికి, రాష్ట్ర శాఖలకు అనేక విలువైన సలహాలు సూచనలు చేశారు. సాధారణ సభ్యులు, ఆయా స్థాయిల్లోని నాయకులు స్వీయ అధ్యయనానికి ప్రాధాన్యత నివ్వాలని ఆయన నొక్కిచెప్పేవారు. పార్టీ ఆధ్వర్యంలో గ్రంథాలయాలను, రాత్రి పాఠశాలను నిర్వహించాలని, పార్టీ కాడర్‌లో అధ్యయనాన్ని పెంచే అన్ని చర్యలూ చేపట్టాలని అనునిత్యం అయన చెప్పేవారు. కమ్యూనిస్టుపార్టీ అంతర్గతంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాలంలో నాయకత్వం పైనుంచి కిందకి రెండుగా చీలిన తరుణంలో రాజశేఖరరెడ్డి రెండు పక్షాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు తనవంతు కృషిచేశారు. విశాలాంధ్ర విజ్ఞానసమితి బాధ్యతల్లో పాలుపంచుకున్నారు. ఆయన జీవితం నేటితరానికి ఆదర్శనీయం.

(నేడు నీలం రాజశేఖరరెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా)

నేడు చత్తీస్‌గఢ్ సీఎల్పీ భేటీ

రాయ్‌పూర్: ఇటీవల ముగిసిన చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ బుధవారం తన శాసనసభా పక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ప్రతిపక్ష బీజేపీ 90 సీట్లలో 54 కైవసం చేసుకోవడం ద్వారా సంపూర్ణ మెజారిటీతో తిరిగి అధికారంలోకి వచ్చింది. 2018లో రాష్ట్రంలో 68 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ బలం 35 సీట్లకు తగ్గగా, గోండ్వానా గంతంత్ర పార్టీ (జీజీపీ) ఒక్క సీటును గెలుచుకోగలిగింది. గతంలో భూపేష్ బఘెల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలోని తొమ్మిది మంది మంత్రులు, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. కొత్తగా ఎన్నికైన 35 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు రాయ్‌పూర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం రాజీవ్ భవన్‌లో జరుగుతుందని రాష్ట్ర కాంగ్రెస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి సుశీల్ ఆనంద్ శుక్లా మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కుమారి సెల్జా, జాతీయ కోశాధికారి అజయ్ మాకెన్ కూడా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలోనే కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతను కూడా ఎన్నుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ సీనియర్ నాయకులలో మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘెల్, మాజీ మంత్రులు కవాసీ లఖ్మా, ఉమేష్ పటేల్, అనిలా భెండియా, మాజీ అసెంబ్లీ స్పీకర్ చరణ్ దాస్ మహంత్ ఉన్నారు.

కర్నాటక రాజ్ భవన్‌కు బాంబు బెదిరింపు

బెంగళూరు : కర్నాటక రాజ్ భవన్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. సోమవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి అధికారులకు బాంబు హెచ్చరిక ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అధికారులు వేగంగా స్పందించారు. ఈ నేపథ్యంలో కర్నాటక రాజ్ భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రాత్రి 11:30 గంటల సమయంలో వచ్చిన ఈ ఫోన్ కాల్ తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది. రాజ్ భవన్ ఆవరణపై బాంబులు వేస్తానని అజ్ఞాత వ్యక్తి హెచ్చరించాడు. దీంతో పోలీసులు, భద్రతా సిబ్బంది అప్రత్తమయ్యారు. బాంబును వెతికేందుకు తక్షణం రంగంలోకి దిగారు. బాంబ్ స్క్వాడ్, కే-9 యూనిట్లతో ఘటనా స్థలంలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. రాజ్ భవన్ మైదానంలో అధికారులు కూంబింగ్ నిర్వహించారు. ఫోన్ కాల్ ముప్పు విశ్వసనీయతను తెలుసుకునేందుకు, ఆ ప్రాంత భద్రతను నిర్ధారించడానికి సమగ్ర తనిఖీని కొనసాగించారు. అయితే బాంబు హెచ్చరిక చేసిన కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనేది కనిబెట్టేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఆ ఫోన్ నంబరును ట్రాక్ చేసే పనిలో అధికారులు చురుగ్గా నిమగ్నమయ్యారు. కాగా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులను లక్ష్యంగా చేసుకుని దుండగులు బాంబు బెదిరింపులకు పాల్పడ్డారు. రాజ్ భవన్‌లో బాంబు పెట్టినట్టు ఆ సంస్థ అధికారులకే ఫోన్ వచ్చింది. దీంతో ఎన్ఐఏ అధికారులు బెంగళూరు పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ ఆందోళనకర పరిణామాల నేపథ్యంలో సెంట్రల్ డివిజన్ పోలీసులు విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఒమర్ అబ్దుల్లా విడాకుల పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ (ఎన్‌సీ) అధ్యక్షుడు, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా... తన భార్య పాయల్ అబ్దుల్లా నుంచి విడాకుల కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఒమర్ అబ్దుల్లా విడాకుల పిటిషన్‌ను కొట్టివేస్తూ గతంలో ఫ్యామిలీ కోర్టు తీసుకున్న నిర్ణయం సరైనదేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఒమర్‌పై ఆయన భార్య చూపిన క్రూరత్వం ఏమీ లేదని, అందువల్ల విడాకులు మంజూరు చేయడం కుదరదని కోర్టు తేల్చిచెప్పింది. 'ఒమర్ అబ్దుల్లా తన భార్య క్రూరంగా వ్యవహరిస్తున్నదంటూ విడాకుల కోసం పిటిషన్ వేశారు. అయితే ఆ పిటిషన్‌లో ఆమె క్రూరత్వానికి సంబంధించిన ఆరోపణలు స్పష్టంగా లేవు. చేసిన ఆరోపణలకు కూడా పెద్దగా ఆధారాలు లేవు. కింది కోర్టు తీర్పును సవాలు చేస్తూ వేసిన అప్పీల్ పిటిషన్‌లో కూడా ఎలాంటి మెరిట్స్ లేవు. అందువల్ల ఈ అప్పీల్‌ను తోసిపుచ్చుతున్నాం' అని న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ, జస్టిస్ వికాస్ మహాజన్‌తో కూడిన ధర్మాసనం తీర్పుచెప్పింది. అయితే, ఒమర్ అబ్దుల్లా, ఆయన భార్య పాయల్ అబ్దుల్లా గొడవల కారణంగా ఇప్పటికే విడివిడిగా ఉంటున్నారు. పాయల్ అబ్దుల్లా... రాజస్థాన్ కాంగ్రెస్ అగ్ర నేత సచిన్ పైలట్ సోదరి కావడం గమనార్హం.

20న ప్రధాని మోదీతో మమత భేటీ

కోల్‌కతా : కేంద్ర నిధుల విడుదల కోరుతూ ఈనె 20న ప్రధాని నరేంద్ర మోదీతో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సమావేశం కానున్నారు.

ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కోరుతూ మమతా బెనర్జీ చేసిన వినతికి ప్రధాని కార్యాలయం (పీఎంఓ) సానుకూలంగా స్పందించిందని అధికారులు తెలిపారు. డిసెంబరు 20 ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీతో మమతా బెనర్జీ భేటీ అవుతారు. కాగా, వివిధ పద్దుల కింద కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌కు రూ.1.15 లక్షల కోట్ల బకాయిలు ఉందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇటీవల వెల్లడించారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీతో దీదీ భేటీ కానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

అక్రమ వలసదారుల సమాచారం సేకరణ అసాధ్యం: కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో అక్రమంగా నివసిస్తోన్న వలసదారుల కచ్చితమైన సమాచారాన్ని సేకరించడం అసాధ్యమని కేంద్ర ప్రభుత్వం మంగళవారం వెల్లడించింది. ఇటువంటి వారు అక్రమంగా, రహస్య మార్గాల్లో వస్తుంటారని... వారిని గుర్తించడం కష్టమైన ప్రక్రియ అని తెలిపింది. అక్రమ వలసదారులు, వారి కట్టడికి తీసుకుంటున్న చర్యలపై సుప్రీం కోర్టు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ దాఖలు చేసిన అఫిడవిట్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ విషయాలు పేర్కొంది. 'సరైన ధ్రువపత్రాలు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అక్రమ వలసదారులు దేశంలోకి ప్రవేశిస్తుంటారు. రహస్య మార్గాల్లో దేశంలోకి వస్తుండటం వల్ల ఇటువంటి వారిని గుర్తించడం, నిర్బంధించడం, తిరిగి పంపించడం సంక్లిష్టమైన ప్రక్రియ. దేశంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తోన్న ఇలాంటి అక్రమ వలసదారుల కచ్చితమైన సమాచారాన్ని సేకరించడం కూడా అసాధ్యం' అని సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

ఇక పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ కింద ఇప్పటి వరకు 17,861 మందికి భారత పౌరసత్వం కల్పించినట్లు వెల్లడించింది. విదేశీయుల ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం... 1966-71 మధ్య కాలానికి సంబంధించి 32,381 మందిని విదేశీయులుగా గుర్తించినట్లు తెలిపింది. 2017-22 మధ్య కాలంలో 14,346 మంది విదేశ్యయులను పంపించివేశామని పేర్కొంది. పౌరసత్వ చట్టంలోని 'సెక్షన్ 6ఏ' అనేది అసోంలోని అక్రమ వలసదారులకు సంబంధించినది. అస్సాం ఒప్పందం కింద పౌరసత్వం పొందే వారి కోసం ప్రత్యేక నిబంధనను అందులో పొందుపర్చారు. దీనివల్ల అక్రమ వలసదారులు పెరిగిపోతున్నారని, దానిని రద్దు చేయాలని కోరుతూ అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈ క్రమంలో జనవరి 1, 1966 నుంచి వచ్చిన ఎంతమంది వలసదారులకు భారత పౌరసత్వం వచ్చారనే విషయాలను అఫిడవిట్ ద్వారా తెలియజేయాలని డిసెంబరు 7న కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వలసదారుల కట్టడికి తీసుకుంటున్న చర్యలను వివరించాలని కోరింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా అఫిడవిట్ దాఖలు చేసింది.

చరిత్ర తెలియదు...అయినా తిరగరాస్తున్నారు

అమిత్ షా వ్యాఖ్యలపై రాహుల్‌గాంధీ మండిపాటు

న్యూఢిల్లీ: భారతదేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ మంగళవారం తిప్పికొట్టారు. బీజేపీ నాయకుడికి చరిత్ర తెలియదని, అందుకే పదేపదే దానిని తిరగరాస్తున్నారని రాహుల్ విమర్శించారు. పండిత్ నెహ్రూజీ తన జీవితాన్ని ఈ దేశానికి అంకితమిచ్చారని, దేశ ప్రజల కోసం ఏళ్ల తరబడి జైల్లో ఉన్నారని గుర్తుచేశారు. అమిత్‌షాకు కనీసం చరిత్ర తెలియదని, అందుకే పదే పదే దాన్ని తిరగరాస్తూనే ఉన్నారని రాహుల్ మండిపడ్డారు. జమ్మూ-కశ్మీర్‌కు సంబంధించి రెండు కీలక బిల్లులను రాజ్యసభ సోమవారం ఆమోదించింది. ఈ బిల్లులపై చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... గత కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. కేవలం ఒకేవ్యక్తి పొరపాటు వల్ల భారత్‌లో జమ్మూ-కశ్మీర్ భాగం కావడం ఆలస్యమైందని పరోక్షంగా జవహర్‌లాల్ నెహ్రూపై ఆరోపణలు చేశారు. అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. దీనిపై తాజాగా రాహుల్ గాంధీ స్పందించారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాలకు హాజరైన రాహుల్... అమిత్ షా వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. దేశంలో నెలకొన్న ప్రధాన సమస్యల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బీజేపీ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని ఆయన అన్నారు. 'కుల గణన, నిరుద్యోగం, దేశంలోని ధనమంతా ఎవరి చేతుల్లో ఉంది.. ఇవన్నీ ప్రధాన అంశాలు. వీటిపై చర్చించేందుకు బీజేపీ భయపడుతోంది. అందుకే వీటి నుంచి పారిపోతోంది' అని రాహుల్ ఎద్దేవా చేశారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ గిరిజన, ఓబీసీ నేతలను ముఖ్యమంత్రులను చేయడంపై స్పందిస్తూ తాము కూడా ఛత్తీస్‌గడ్‌లో ఓబీసీని ముఖ్యమంత్రిని చేశామని, అది పెద్ద సమస్య కాదని, నిర్మాణంలో ఓబీసీల భాగస్వామ్యం ఎంత అనేది అత్యంత కీలకమని రాహుల్ అన్నారు. 'ప్రధాని నరేంద్రమోదీ ఓబీసీ. కానీ ప్రభుత్వాన్ని 90 మంది అధికారులు నడుపుతున్నారు. అందులో ముగ్గురే ఓబీసీలు. వారి కార్యాలయాలు ఏదో మూలన పడి ఉన్నాయి. సంస్థాగత నిర్మాణంలో ఓబీసీల భాగస్వామ్యం ఏమిటనేది నా ప్రశ్న. దళితులు, ఆదివాసీల పాత్ర ఎక్కడైనా కనిపిస్తోందా? ఇదే దేశం ముందున్న ప్రధాన ప్రశ్న' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధాన సమస్యలను పక్కదారి పట్టించడానికే నెహ్రూ, ఇతర నేతల గురించి బీజేపీ పదేపదే మాట్లాడుతుందని ఆరోపించారు. జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లును, జమ్మూ-కశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లును రాజ్యసభ సోమవారం దాదాపు నాలుగు గంటల చర్చ తర్వాత ఆమోదించింది. ఈ రెండింటినీ లోక్‌సభ గతవారమే ఆమోదించింది. రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లులు చట్టంగా మారనున్నాయి. కశ్మీరీ శరణార్థుల నుంచి ఇద్దరిని, పాక్ ఆక్రమిత కశ్మీర్ నిర్వాసితుల నుంచి ఒకరిని శాసనసభకు నామినేట్ చేసేందుకు, కొన్ని వర్గాలకు రిజర్వేషన్ ఇచ్చేందుకు ఈ బిల్లులు వీలు కల్పిస్తాయి.

అభివృద్ధే కశ్మీరు ప్రజల ఆకాంక్ష

ప్రధాని మోదీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: జమ్మూ-కశ్మీరులో గడచిన నాలుగేళ్లలో క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం కలిగించామని, అభివృద్ధి, ప్రజాస్వామ్యం, నిబద్ధతతోనే ఇది సాధ్యమైందని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. జమ్మూ-కశ్మీరుకు సంబంధించి ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు మంగళవారం అత్యధిక పత్రికల్లో ప్రధాన శీర్షికగా నిలవడంపై మోదీ స్పందించారు. బీజేపీ సభ్యుడిగా దశాబ్దాలుగా ఈ సమస్యతో పోరాడుతున్నామని చెప్పారు. జమ్మూ-కశ్మీరు ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నట్లు తాను స్పష్టంగా చెప్పగలనని పేర్కొన్నారు. కశ్మీరు ప్రజల బలం, నైపుణ్యతతో భారతదేశం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. హింస, అనిశ్చితి నుంచి తమ పిల్లలకు విముక్తి కావాలని, నాణ్యమైన జీవితం లభించాలని అక్కడి ప్రజలు ఉవ్విళ్లూరుతున్నట్లు చెప్పారు. జమ్మూ-కశ్మీరు అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మోదీ చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని పటిష్టమంతం చేసిందన్నారు. ఐక్యత, సుపరిపాలన సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. జమ్ము, కశ్మీరు, లడక్‌లో పుట్టిన ప్రతిబిడ్డ భవిష్యత్‌కు స్పష్టమైన గ్యారెంటీ ఉంటుందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా కశ్మీరు ప్రజలు సుదీర్ఘకాలం జైలు జీవితం గడపాల్సిన అవసరం ఉండబోదన్నారు. పిల్లలకు భవిష్యత్ అవసరాలు కల్పించాల్సిన బాధ్యతపై మనపై ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు జమ్మూ-కశ్మీరులో నిరాశ, నిస్పృహల స్థానంలో అభివృద్ధి, ప్రజాస్వామ్యం, హుందాతనం పరిఢవిల్లనున్నట్లు చెప్పారు. ఇంతకుముందు మహిళలు, ఎస్‌సీ, ఎస్‌టీ, సమాజంలోని అణగారిన వర్గాల ఆకాంక్షలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, 2019 ఆగస్టు 5 వాటన్నింటినీ మార్చివేసిందని చెప్పుకొచ్చారు. జమ్మూ-కశ్మీరుకు స్వయంప్రతిపత్తి రద్దు, రాష్ట్రం నుంచి రెండు కేంద్రపాలిత ప్రాంతాలు విభజించడం వంటి నిర్ణయాలు మార్పునకు ప్రధాన కారణమని చెప్పారు. ఎలాంటి భయం లేకుండా కేంద్రం చట్టాలన్నీ ఇప్పుడు అక్కడ అమలు చేయవచ్చని మోదీ అన్నారు. మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను మరింత విస్తరించవచ్చని, శరణార్థులు సైతం ఇక స్వేచ్ఛగా జీవించవచ్చన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతను పూర్తిగా సమర్థించిందని గుర్తుచేశారు.

దేశంలో డాక్టర్-జనాభా నిష్పత్తి 1:834

న్యూఢిల్లీ: ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణం 1:1000 కంటే భారతదేశంలో డాక్టర్-జనాభా నిష్పత్తి (1:834) మెరుగ్గా ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ మంగళవారం రాజ్యసభకు వెల్లడించారు. దేశంలో 36.14 లక్షల మంది రిజిస్టర్డ్ నర్సింగ్ సిబ్బంది ఉన్నారని.... వీరి జనాభా నిష్పత్తి -:476గా ఉందని ఆమె వివరించారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) అందించిన సమాచారం ప్రకారం... జూన్, 2022 నాటికి 13,08,009 అల్లోపతి వైద్యులు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్స్, నేషనల్ మెడికల్ కమిషన్‌లో నమోదు చేసుకున్నారని వివరించారు. 'నమోదిత అల్లోపతి వైద్యులు 80 శాతం, 5.65 లక్షల మంది ఆయుష్ వైద్యులు అందుబాటులో ఉన్నారని అంచనా వేసినట్లయితే... దేశంలో డాక్టర్-జనాభా నిష్పత్తి 1:834 గా ఉందని... ఇది డబ్ల్యూహెచ్‌ఓ ప్రమాణం 1:1000 కంటే మెరుగ్గా ఉంది. అలాగే, 34.33 లక్షల మంది నమోదిత నర్సింగ్ సిబ్బంది ఉన్నారు ' అని ఓ ప్రశ్నకు రాతపూర్వక సమాధానంలో వివరించారు. దేశంలో వైద్య కళాశాలలు, అందుకనుగుణంగా ఎంబీబీఎస్ సీట్లను ప్రభుత్వం పెంచిందని కూడా ఆమె తెలిపారు. 2014కు ముందు దేశంలో 387 మెడికల్ కళాశాలలుండగా... ప్రస్తుతం 706కు పెరిగాయని పేర్కొన్నారు. అలాగే 2014కు ముందు ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 51,348 కాగా... ప్రస్తుతం 112% పెరుగుదలతో 1,08,940కి చేరినట్లు వివరించారు. అలాగే పీజీ సీట్లు సైతం 127% పెరుగుదలతో 31,185 నుంచి 70,674కు చేరినట్లు మంత్రి పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్‌కు మోదీ ఇచ్చిన గ్యారంటీ ఇదేనా? కాంగ్రెస్



న్యూఢిల్లీ: బీజేపీ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్‌ను ఎన్నుకోవడంపై కాంగ్రెస్ మండిపడింది. మోహన్ యాదవ్‌పై ఉజ్జయిని మాస్టర్‌ప్లాన్‌లో పెద్ద ఎత్తున అవకతవకలు సహా తీవ్రమైన అవినీతి ఆరోపణలున్నాయని పేర్కొంది. ఎవరూ ఊహించని విధంగా ఇతర వెనుకబడిన వర్గా (ఓబీసీ)నికి చెందిన, మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయిన యాదవ్‌ను బీజేపీ సోమవారం మధ్యప్రదేశ్ తదుపరి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం 'ఎక్స్' వేదికగా 'ఎన్నికల ఫలితాలు వచ్చిన ఎనిమిది రోజుల తరువాత, బీజేపీ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిని ఎన్నుకుంది. ఈయనపై ఉజ్జయిని మాస్టర్‌ప్లాన్‌లో పెద్ద ఎత్తున అవకతవకలతో పాటు చాలా తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి' అని తెలిపారు. 'సింహస్థ కోసం రిజర్వు చేయబడిన 872 ఎకరాల భూమిలో, ఆయన భూమిని వినియోగ స్వభావాన్ని మార్చడం ద్వారా తప్పించడం జరిగింది' అని జైరామ్ పేర్కొన్నారు. యాదవ్‌కు సంబంధించి అధికార దుర్భాషలాడటం, బెదిరించడం, అభ్యంతరకర ప్రకటనలు చేయడం వంటివి సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయని జైరామ్ ఆరోపించారు. మధ్యప్రదేశ్‌కు ఇదేనా మోదీ హామీ అని ప్రశ్నించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో సన్నిహితంగా ఉండే యాదవ్... ముఖ్యమంత్రి పదవికి పోటీపడేవారిలో లేరు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్ర జనాభాలో 48 శాతానికి పైగా ఉన్న ఓబీసీ వర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు. 2013లో ఉజ్జయిని సౌత్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన 2018లో మళ్లీ 2023లో అసెంబ్లీ సీటును నిలబెట్టుకున్నారు. పదవీ విరమణ చేసిన సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్ కేబినెట్‌లో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు.

పర్యావరణాన్ని కాపాడండి

కాప్ 28 వేదిక పైకి దూసుకెళ్లి నినదించిన భారత చిన్నారి

దుబాయ్ : పర్యావరణ పరిరక్షణ ఒక చిన్నారి నడుంబిగించింది. ప్రపంచ ఉన్నత స్థాయి సమావేశ వేదికపై గళమెత్తింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ వేదికగా 'కాప్-28' ప్రపంచ వాతావరణ సదస్సు జరుగుతోంది. ఈ ఐక్యరాజ్య సమితి ఉన్నత స్థాయి కార్యక్రమంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. 12 ఏళ్ల భారతీయ బాలిక వేదిక పైకి దూసుకొచ్చి... 'శిలాజ ఇంధనాలకు ముగింపు పలకండి... మన భూగ్రహాన్ని, భవిష్యత్తును రక్షించండి' అని ప్లకార్డు ప్రదర్శించింది. మణిపూర్‌కు చెందిన ఆ చిన్నారి పేరు లిసిప్రియా కంగుజం. వాతావరణ కార్యకర్త అయిన లిసిప్రియా శిలాజ ఇంధనాల వాడకాన్ని వ్యతిరేకిస్తోంది. తాజాగా దుబాయ్ వేదికగా జరుగుతోన్న కాప్ సదస్సులో కూడా తన గళాన్ని వినిపించింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆమెను అక్కడినుంచి దూరంగా తీసుకెళ్లడానికి ప్రయత్నించింది. అప్పటికే ఆమె ప్రసంగానికి ముగుద్ధలైన ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందించారు. ఈ సంఘటనపై కాప్-28 డైరెక్టర్ జనరల్ అంబాసిడర్ మజిద్ అల్ సువైదీ స్పందించారు. ఆ చిన్నారి ఉత్సాహాన్ని చూసి ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు. అలాగే తన నిరసన అనంతరం లిసిప్రియా ట్వీట్ చేశారు. 'నేను నిరసన తెలియజేయడంతో వారు నన్ను 30 నిమిషాల పాటు అదుపులోకి తీసుకున్నారు. శిలాజ ఇంధనాలు వాడొద్దని చెప్పడమే నేను చేసిన నేరం. మీరు నిజంగా శిలాజ ఇంధనాలను వ్యతిరేకిస్తే... నాకు మద్దతు ఇవ్వండి. నిబంధలకు విరుద్ధంగా ఐరాస ప్రాంగణంలోనే బాలల హక్కుల ఉల్లంఘన జరిగింది. ఐరాస వద్ద నా గళాన్ని వినిపించే హక్కు ఉంది' అని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌ను ట్యాగ్ చేసింది. 'శిలాజ ఇంధనాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు నా బ్యాడ్జ్‌ను నిలిపివేశారు. దీనికి కారణం ఏమిటి? మీరు నిజంగా శిలాజ ఇంధనాలకు వ్యతిరేకంగా నిలబడితే, మీరు నాకు మద్దతు ఇవ్వాలి. మీరు వెంటనే నా బ్యాడ్జ్‌లను విడుదల చేయాలి' అని పేర్కొంది. నవంబరు 30న ప్రారంభమైన కాప్ 28 సదస్సు మంగళవారంతో ముగిసింది. దీనికి 190 దేశాల నుంచి 60 వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ లిసిప్రియా.. ఈస్ట్ తైమూర్ ప్రత్యేక రాయబారిగా సదస్సుకు హాజరయ్యింది. లిసిప్రియా చిన్నవయసు నుంచే వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ వంటి అంశాలపై ఉద్యమిస్తోంది. ఎన్నో వేదికలపై ఉపన్యాసాలిచ్చింది. 'క్లైమేట్ ఛేంజ్ లా' తీసుకురావాలంటూ మన పార్లమెంటు ముందూ ప్రదర్శనలు చేసింది. ఈమెను 'వరల్డ్ చిల్డ్రన్ పీస్ ప్రైజ్ 2019' వరించింది.

నెహ్రూపై నిందలా?

అమిత్‌షా వ్యాఖ్యలపై ఫరూక్

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పుపై నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. 370వ అధికారణానికి ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బాధ్యుడు కాదని స్పష్టంచేశారు. కశ్మీరు సమస్యకు జవహర్‌లాల్ నెహ్రూ కారణమంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంటులో నిందించడంపై అబ్దుల్లా స్పందించారు. అనువుకాని సమయంలో కాల్పుల విరమణ ప్రకటించడం, సమస్యను ఐక్యరాజ్యసమితి వద్దకు తీసుకెళ్లడం కీలక తప్పిదాలని అబ్దుల్లా మంగళవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో చెప్పారు. 'నెహ్రూపై ఎందుకు విషయం చిమ్ముతున్నారో నాకు అర్థం కావడం లేదు. నెహ్రూకు ఎలాంటి సంబంధం లేదు. సర్దార్ పటేల్ ఉన్న సమయంలోనే ఆర్టికల్ 370 అమలులోకి వచ్చింది. నాడు కేబినెట్ సమావేశం జరిగిన సమయంలో నెహ్రూ అమెరికాలో ఉన్నారు. 370 నిర్ణయం తీసుకున్నప్పుడు శ్యామప్రసాద ముఖర్జీ అక్కడే ఉన్నారు' అని ఫరూక్ అబ్దుల్లా చెప్పారు. '370 అధికరణం రద్దు అంశం మొదటి నుంచి సుప్రీంకోర్టు చేతిలోనే ఉంది. భవిష్యత్‌లో ఏమి జరుగుతుందో వేచిచూద్దాం' అని తీర్పుపై స్పందిస్తూ ఫరూక్ అన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీరులో అభివృద్ధి పరుగులు తీస్తున్నట్లు బీజేపీ ప్రచారం చేస్తుంది గదా అని విలేకరులు అడుగగా 'అక్కడికి వెళ్లండి...స్వయంగా మీరే చూడండి' అని ఫరూక్ అన్నారు. సత్వరమే ఎన్నికలు జరగాలని మేము కోరుకుంటున్నాం. అయినా సెప్టెంబరు దాకా కోర్టు సమయం ఇచ్చింది. రాష్ట్రహోదాపై తర్వాత మాట్లాడతామని చెప్పారు.

ముందుగా అనుమతి తప్పనిసరి

ఉద్యోగులకు కేంద్రం కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ : ప్రైవేటు సంస్థల నుంచి అవార్డులు అందుకునే విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. వాటిని అంగీకరించే ముందు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని కేంద్ర ప్రభుత్వ విభాగాలకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 'ప్రైవేటు సంస్థలు ఇచ్చే అవార్డులు స్వీకరించే ముందు ప్రభుత్వ ఉద్యోగులు సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి తీసుకోవాలి. సదరు ఉద్యోగి పని చేస్తున్న మంత్రిత్వ శాఖ లేదా విభాగం కార్యదర్శి నుంచి ఈ అనుమతులు పొందాలి. ఇక ప్రభుత్వ కార్యదర్శులు, సెక్రటరీ ర్యాంక్ అధికారులు ఈ అవార్డులు స్వీకరించాలంటే కేబినెట్ కార్యదర్శి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి' అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ప్రభుత్వ ఉద్యోగులు... ప్రైవేటు సంస్థల నుంచి అవార్డులు స్వీకరించేందుకు అధికారులు అనుమతులివ్వాలని సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతేకాకుండా అవార్డులు నగదు లేదా ఇతర సదుపాయాల రూపంలో ఉండకూడదని స్పష్టం చేసింది. 1964 నాటి కేంద్ర సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం, ఏ ప్రభుత్వ ఉద్యోగి ప్రైవేటు వ్యక్తుల నుంచి అవార్డులు తీసుకోకూడదు. ఆ ఉద్యోగి గౌరవార్థం జరిగే ప్రైవేటు కార్యక్రమాలకు హాజరుకాకూడదు.

కానీ ఈ నిబంధనలను ఆ తర్వాత అనేక సార్లు మార్చారు. చివరిసారిగా 2000 సంవత్సరంలో దీనిపై ఉత్తర్వులు జారీ చేస్తూ, 'ప్రైవేటు సంస్థలు, ట్రస్టులు ఇచ్చే ద్రవ్య ప్రయోజనాల అవార్డులను తీసుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు అనుమతి లేదు' అని స్పష్టం చేశారు. అయితే, ఈ నిబంధనలను ఉద్యోగులు సరిగా పాటించకపోవడంతో తాజాగా కేంద్రం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. వీటిని ఉద్యోగులంతా తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది.

అంగన్‌వాడీలపై సాచివేత ధోరణి తగదు

- ప్రభుత్వ వైఫల్యం వల్లే నిరవధిక సమ్మె
- న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలి
- సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల సమస్యలపై సాచివేత ధోరణి అవలంబిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. అనేక దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం కావడం వల్లే అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందని... వారి ఉద్యమానికి సీపీఐ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు తెలుపుతోందని ముప్పాళ్ల స్పష్టం చేశారు. మంగళవారం సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్‌తో కలిసి స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల దీక్షా శిబిరాన్ని ముప్పాళ్ల సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ టీచర్లకు తెలంగాణకు మించిన జీతాలు ఇస్తామని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ను తెస్తామంటూ ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేసిన వైసీపీ... తీరా అధికారంలోకి వచ్చాక ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తోందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులను చర్చలకు పిలిచి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రత్యక్షంగా పరోక్షంగా వారి పోరాటంతో కలిసి నడుస్తామని, వారికి అండగా ఉంటామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి కూడా ఉద్యోగ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. రిటైరైన అంగన్ వాడి వర్కర్స్ కు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, రిటైర్ అయ్యేనాటికి ఇస్తున్న వేతనంలో సగం వేతనం పెన్షన్ గా ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆర్ వందనం. బ్రహ్మయ్య, ఏఐటీయూసీ నాయకురాలు శారమ్మ, సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు, అంగన్ వాడీ టీచర్లు, సహాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి: చలసాని వెంకటరామారావు

విశాలాంధ్ర-నూజివీడుటౌన్: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ అంగన్‌వాడీ యూనియన్లు ఏఐటీయూసీ, సీఐటీయూ అధ్వర్యంలో నిరవధిక సమ్మెను ప్రారంభించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు హనుమాన్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచడంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ గా ఇవ్వాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్ గా మార్చాలని కోరారు. మినీ వర్కర్లకు పదోన్నతులు కల్పించి, వర్కర్స్ తో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, అంగన్‌వాడీలపై రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. 2017 నుండి టీ ఏ బిల్లులు, ఇతర బకాయులు వెంటనే చెల్లించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కన్వీనర్ ర్యాంకుల లక్ష్మణరావు అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఏలూరు జిల్లా అధ్యక్షులు రొంపి చర్ల క్రిస్టియన్ అమ్మ, జిల్లా నాయకులు చాకిరీ విజయదుర్గ, మారుమూడి విజయలక్ష్మి, ముల్లంగి బుజ్జి, బి.సుబ్బారావమ్మ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఏ ఆదిలక్ష్మి, ప్రాజెక్టు నాయకులు పద్మ, జ్యోతి, లక్ష్మీకాంతం, రమాదేవి విజయలక్ష్మి, మణి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

22న మద్దుకూరి చంద్రం స్మారకోపన్యాసం

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణాజిల్లా గన్నవరంలోని మద్దుకూరి చంద్రం తెలుగు సాంస్కృతిక వికాస కేంద్రం అధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు 'తెలుగు భాషా వికాసం- చంద్రం గారి కృషి' అంశంపై విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు స్మారకోపన్యాసం చేస్తారని వికాస కేంద్రం వ్యవస్థాపక సభ్యుల తరుపున డాక్టర్ మద్దుకూరి విజయకుమార్, డాక్టర్ ఉప్పులూరి స్వర్ణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు దీవి జవహర్‌లాల్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో రక్తదానాన్ని మహోద్యమంగా మార్చిన సేవామూర్తి తరిమెల అమర్నాథరెడ్డికి మద్దుకూరి చంద్రం జీవిత సాఫల్య సేవా పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితులలో ఆపన్నులకు సేవలందించిన దళం సుందరయ్య రెడ్‌షర్ట్ వలంటీర్లకు చిరు బహుమతులు అందించనున్నారు. పాఠశాలల గ్రంథాలయాలకు పిల్లల తెలుగు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం చిన్నారి మద్దుకూరి మధు మహిత కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

17కు ఫైబర్ నెట్ కేసు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈనెల 17వ తేదీకి సుప్రీం కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో రెండుపక్షాలు సమన్వయం పాటించాలంటూ న్యాయస్థానం సూచించింది. ఈ కేసులో చంద్రబాబు తరపున, సీఐడీ తరపున న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. కేసుకు సంబంధించి, అలాగే జైలుకు పంపిన విషయాలపై చంద్రబాబు బహిరంగంగా మాట్లాడుతున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసుపై చంద్రబాబు బహిరంగంగా మాట్లాడకుండా ఆంక్షలు విధించాలని ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. చంద్రబాబు తరపు న్యాయవాది లూథ్రా వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వం తరపునే ఢిల్లీతోపాటు అనేక ప్రాంతాల్లో అదనపు ఏజీ, సీఐడీ డీజీ మీడియా సమావేశాలు నిర్వహించారని వివరించారు. వాటితో పోలిస్తే చంద్రబాబు ఎక్కడా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. చంద్రబాబు కోర్టు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా మాట్లాడలేదని అన్నారు. దీంతో రెండుపక్షాలు సంయమనం పాటించాలని న్యాయస్థానం సూచించింది.

ఈసీఐపై బీజేపీ పెత్తనం

అధికారం కోసమే 'నియామక బిల్లు'తో కుట్ర రాజ్యసభలో వినయ్ విశ్వం

న్యూఢిల్లీ: భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ)ని తన చెప్పుచేతుల్లో పెట్టుకోవాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోందని, తమ పార్టీ ఒక్కటే అధికారంలో కొనసాగే విధంగా ఈసీల నియామక బిల్లుకు తెరతీసి కుట్ర చేస్తోందని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం విమర్శించారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడటే ఈ పార్టీ ఉద్దేశమని దుయ్యబట్టారు. ప్రధన ఎన్నికల కమిషన్, ఎన్నికల కమిషనర్ల నియామకాల బిల్లు-2023పై చర్చ సందర్భంగా వినయ్ విశ్వం ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ సభ ఉద్దేశాలకు ఈ బిల్లు విరుద్ధమన్నారు. ఈ బిల్లు ద్వారా ఎన్నికల కమిషన్‌ను తమ ఫామ్‌హౌస్‌లో మేకలా కట్టిపాడేయాలన్నది బీజేపీ ఉద్దేశమన్నారు. అధికరణ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పును వేడుక చేసుకున్న బీజేపీ వర్గాలు ఆపై 24 గంటల్లోపే సర్వోన్నత న్యాయస్థానాన్ని మర్చిపోయాయని, ఇదే బీజేపీ నైజమని వినయ్ విశ్వం వ్యాఖ్యానించారు. బీజేపీ సభ్యులు పదేపదే అంబేద్కర్ గురించి ప్రస్తావిస్తారు. కానీ ఆయన మాటలను నీరుగార్చేడమే వారి ఉద్దేశమని సీపీఐ ఎంపీ దుయ్యబట్టారు. ఎన్నికల సంఘం స్వచ్ఛందంగా పని చేయాలని, పాలకుల చెప్పుచేతుల్లోకి వెళ్లకూడదని రాజ్యాంగ నిర్మాతలు భావించారు కానీ బీజేపీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. కేవలం అధికార వాంఛతో ఈసీఐని పూర్తిస్థాయిలో తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తోంది. అంబేద్కర్ గురించి మాట్లాడే బీజేపీ... హిట్లర్ అడుగుజాడల్లో నడుస్తోంది' అని వినయ్ విశ్వం దుయ్యబట్టారు. 'పార్లమెంటరీ వ్యవస్థ ద్వారా అధికారంలోకి వచ్చిన హిట్లర్... తనకున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ద్వేషంతో కుట్ర చేసి రైచ్‌స్టాగ్ (జర్మనీ పార్లమెంట్)కు నిప్పు పెట్టించారు. బీజేపీ కూడా పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. అంతర్గతంగా దానిని దెబ్బతీస్తోంది. స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికలు బీజేపీకి పట్టదు' అని విశ్వం వ్యాఖ్యానించారు. 2018లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని, ఆపై 50ఏళ్లు అధికారంలో కొనసాగుతుందని చెప్పారు. నేడు ఈ బిల్లు ద్వారా బీజేపీ అధికారంలో కొనసాగే విజన్‌ను నెరవేర్చుకునేందుకు యత్నిస్తోంద'ని వినయ్ విశ్వం వ్యాఖ్యానించారు.

పీఎస్‌బీల్లో తగ్గిన నియామకాలు

2019 నుంచి 2023 వరకు 1,23,781 పోస్టుల భర్తీ

ఉద్యోగాల సృష్టిపై మోదీవి డొల్ల ప్రకటనలు: వినయ్ విశ్వం

న్యూఢిల్లీ: కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీలు తగ్గినట్లు సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం వెల్లడించారు. 2019 నుంచి 2023 వరకు 1,23,781 మాత్రమే భర్తీ అయ్యాయని పార్లమెంటులో తాను అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కరాడ్ రాత పూర్వకంగా సమాధానం ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల సిబ్బంది నియామకాల్లో క్షీణతను ప్రభుత్వ డేటా స్పష్టం చేస్తోందన్నారు. 2019-20లో 27,538 ఉద్యోగాలను ప్రకటిస్తే 2022-23లో 12,009 ఉద్యోగాలే పడ్డాయి. అంటే నాలుగేళ్లలో సగానికిపైగా ఉద్యోగాలు తగ్గిపోయాయి. బ్యాంకింగ్ రంగంలో పోటీని తట్టుకొని రాణించాలంటే పీఎస్‌బీలు సమర్థంగా ఉండాలి, నియామకాలు క్రమంగా జరగాలి కానీ అధికారులు, క్లర్కులు, సబ్ స్టాఫ్ పోస్టులు 1,36,377 ప్రకటించగా 2019 నుంచి 2023 వరకు 1,23,781 మాత్రమే భర్తీ అయ్యాయి. 2021-22లో క్లర్కుల పోస్టులకు 8.49 లక్షల దరఖాస్తులు వచ్చాయి. 17,475 ఉద్యోగాలు ప్రకటిస్తే సగం కంటే తక్కువ భర్తీ అయ్యాయి. ఉద్యోగుల ఆశావహులకు, ఉద్యోగాల సంఖ్యకు మధ్య పొంతన లేకపోవడాన్ని బట్టి ఉద్యోగాల సృష్టిపై మోదీ ప్రభుత్వం చేసే ప్రకటనల్లో డొల్లతనం స్పష్టమవుతోంది' అని విశ్వం వ్యాఖ్యానించారు. 2016 నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పరిపాలన విభాగపు ఉద్యోగాలను ప్రభుత్వం పరిమితం చేసింది. మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు నియామకాల పరిధి పెంచాలని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు, రాష్ట్ర బ్యాంకులు కోరాయి. ప్రభుత్వ పథకాలు వాటి లబ్దిదారులకు సక్రమంగా చేరడానికి ప్రభుత్వ రంగ బ్యాంకులే మాధ్యమాలు. కానీ సరిపడ సిబ్బంది లేకుండా వాటిని ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నాన్ని చేస్తోంది. క్రోనీలకు లబ్ధి చేకూర్చేందుకు వీటి నిధులను వాడుకుంటోందని వినయ్ విశ్వం విమర్శించారు. ఉద్యోగాల కల్పనలో మోదీ ప్రభుత్వం విఫలమైనట్లు కేంద్రప్రభుత్వ డేటాతో స్పష్టమవుతోందన్నారు. దేశ యువతకుగానీ ప్రజా ధనానికిగా జవాబుదారీ లేదన్నారు. 2008లో మాంద్యమప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా ఉండగలిగిందంటే అందుకు కారణం ప్రభుత్వ రంగ బ్యాంకులు సమర్థంగా పనిచేయడమేనని తెలిపారు. ఎన్నో ఒడిదుడుకులను తట్టుకున్న ఈ వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం శాయాశక్తులు ఒడ్డుతోందని విశ్వం విమర్శించారు. ఉపాధి కల్పనకు బ్యాంకింగ్ రంగం మూలమని, 40శాతం ఉద్యోగాల దరఖాస్తుదారులు మహిళలే అని తెలిపారు. సామాజిక న్యాయం, అవకాశాలకు ఈ రంగం మూలమన్నారు. పీఎస్‌బీలల్లో సిబ్బంది కొరత నివారణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సర్కార్‌పై ఉందని నొక్కిచెప్పారు. యువత సుస్థిర ఉద్యోగాల కోసం తాపత్రయపడుతున్నారని, దీనిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని తగు విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వినయ్ విశ్వం పేర్కొన్నారు.

ఉద్యోగుల పోరాటానికి అండగా ఉంటాం: ఉద్ధవ్ థాక్రే

నాగపూర్: పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి శివసేన అండగా నిలబడుతుందని శివసేన (యూబీటీ) అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే పేర్కొన్నారు. ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం వారి డిమాండ్‌ను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం నాగపూర్‌లోని యశ్వంత్ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే... ఉద్యోగుల డిమాండ్‌ను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. 'ఈరోజు నేను ముఖ్యమంత్రిని కాను. నా పార్టీ, ఎన్నికల గుర్తు దొంగిలించబడ్డాయి. నేను ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే నిర్ణయం తీసుకోవచ్చు కానీ, మీలో ఆత్మ స్థైర్యం కల్పించేందుకు వచ్చాను' అన్నారు. ప్రభుత్వం రావచ్చు పోవచ్చు కానీ మీరు వేసే ప్రతి అడుగులో శివసేన మీకు అండగా నిలుస్తుందని థాక్రే ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. మహారాష్ట్రలోని ప్రభుత్వ ఉద్యోగులు 2005లో రాష్ట్రంలో నిలిపివేయబడిన ఓపీఎస్‌ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఓపీఎస్ కింద ప్రభుత్వ ఉద్యోగులెవరైనా చివరిగా తీసుకున్న జీతంలో 50 శాతానికి సమానమైన నెలవారీ పెన్షన్‌ను పొందుతారు. థాక్రే మాట్లాడుతూ... ఉద్యోగులకు సహాయం చేయడానికి ఈ ప్రభుత్వం సుముఖంగా లేద న్నారు. 'మీ డిమాండ్‌ను ఆమోదించే వరకు మీ పోరాటం ఆపొద్దు... మా పార్టీ అండగా ఉంటుంది' అన్నారు. ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలతో ఉద్యోగులను తప్పుదారి పట్టించే అవకాశం ఉందని థాక్రే పేర్కొన్నారు. మహా రాష్ట్రలో ద్రోహ పూరిత, అసత్య రాజకీయాలకు సమాధి కట్టాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. నాలుగు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఆయా అధికార పార్టీలకు వ్యతిరేకంగా ఓట్లేశారని థాక్రే తెలిపారు. ఉద్యోగుల సమా వేశంలో పాల్గొన్న తర్వాత రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు జరుగుతున్న నాగపూర్‌లోని విధాన్ భవన్ ప్రాంగణంలో థాక్రే విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది జులైలో అజిత్‌పవార్, ఇతర నాయకులతో కలిసి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో చేరిన ఎన్సీపీ నేత ఛగన్ భుజ్‌బల్‌పై ఆయన విరుచుకుపడ్డారు. భుజ్‌బల్‌పై విచారణ (అవినీతి ఆరోపణ కేసులో) అకస్మాత్తుగా ముగిసిన సందున ఆయన్ను కలిసి స్వీట్లు తినిపిస్తానని థాక్రే ఎద్దేవా చేశారు. ఆయనపై విచారణ ముగిసేందుకు ఎలాంటి అద్భుతం చేశాడో తెలుసుకోవాలని ఉందన్నారు.

ఈసీలకు సుప్రీం జడ్జిలతో సమాన హోదా

ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లుకు సవరణలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు జడ్జిలతో సమానంగా సీఈసీ, ఈసీలకు హోదా ఉంటుందని కేంద్రం పేర్కొంది. ఽంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ (ఈసీ) నియామకాల బిల్లులో తాజాగా కొన్ని సవరణలు చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమాన వేతనం సీఈసీ, ఈసీలకు ఉండేలా బిల్లును సవరించారు. ఎంపిక కమిటీల కోసం ఐదుగురితో ప్యానల్... కేంద్రప్రభుత్వ కార్యదర్శి హోదాకు తగ్గకుండా ఉండే ఇద్దరు సభ్యులతో కేంద్ర న్యాయశాఖ నేతృత్వంలో సెర్చ్ కమిటీ ఏర్పాటు... దీనికి కేబినెట్ కార్యదర్శి నేతృత్వం వహించేలా మరొక సవరణ జరిగింది. న్యాయ మంత్రి స్థానంలో కేబినెట్ కార్యదర్శిని ప్రతిపాదించడం ద్వారా సెర్చ్ కమిటీని కేంద్రం అప్‌గ్రేడ్ చేసింది. విధులు నిర్వర్తించే క్రమంలో కోర్టు కేసుల నుంచి ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పించేలా బిల్లులో కొత్త క్లాజు చేర్చాలని అధికారిక సవరణ సూచిస్తోంది. దీంతో సీఈసీ, ఈసీలు పదవుల్లో ఉండగా వారిపై ఎలాంటి సివిల్, క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు వీలుండదు. ఈసీల నియామకాలకు సంబంధించి కేంద్రం ఇటీవల 'ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక షరతులు, పదవీకాలం బిల్లు-2023'ను ఈ ఏడాది ఆగస్టులో రాజ్యసభలో ప్రవేశపెట్టింది. ఎన్నికల కమిషనర్ల హోదాలో మార్పులు చేసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయ మూర్తులతో సమానంగా సీఈసీ, ఈసీల హోదా ఉండగా ప్రతిపాదిత బిల్లులో దాన్ని మార్చి వీరికి కేబినెట్ సెక్రటరీలతో సమానమైన హోదాను ఇస్తామని పేర్కొంది. ఈ మార్పును విపక్ష నేతలు, కొందరు మాజీ సీఈసీలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిర్ణయం ఎన్నికల సంఘం స్వతంత్రతను ఉల్లంఘించడమేనని ఆరోపించారు. తాజాగా బిల్లులో కేంద్రం కొన్ని సవరణలు చేసింది. 'సీఈసీ, ఇతర కమిషనర్లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానంగా వేతనాలు చెల్లించాలి' అని నిర్ణయించింది.

సీఈసీ, ఈసీ ఎంపికలో సీజేఐ ఉండరు

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ (ఈసీ) నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) స్థానంలో కేంద్ర మంత్రిని తీసుకురావడం మరో కీలకాంశం. ఎన్నికల కమిషనర్ల నియామకాలపై పార్లమెంటులో చట్టం చేసే వరకు ప్రధాని నేతృత్వంలో లోక్‌సభలో విపక్ష నేత, సీజేఐ కలిసి ఈ నియామకాలు చేయాలని సుప్రీంకోర్టు మార్చిలో తీర్పునిచ్చింది. తాజా బిల్లు ప్రకారం ఈ నియామకాల కోసం ప్రధాని నేతృత్వంలో త్రిసభ్య సంఘం ఏర్పాటవుతుంది. దీనిలో లోక్‌సభ విపక్ష నేత, ప్రధాని నియమించే ఒక కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉంటారు. ఈ ప్రతిపాదిత కమిటీపై విపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. దీనిలో కేంద్రం ఎలాంటి మార్పులు చేయకలేదు. ఈ బిల్లును ఆగస్టులోనే రాజ్యసభలో ప్రవేశపెట్టగా దీనిపై చర్చ జరగలేదు. సెప్టెంబరులో జరిగిన ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లును తీసుకురావాలని భావించగా అది సాధ్యం కాలేదు.

బంగ్లా ఖాళీ చేయాలని మొయిత్రాకు హౌసింగ్ కమిటీ ఆదేశం

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాను లోక్‌సభ నుంచి బహిష్కరణ గురైన నేపథ్యంలో ఆమెకు దిల్లీలో కేటాయించిన అధికారిక బంగ్లాను ఖాళీ చేయించాలని పార్లమెంటు హౌసింగ్ కమిటీ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ఈ క్రమంలో తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాలంటూ మహువాకు నోటీసులు అందాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. 30 రోజుల గడువులోగా ఆమె బంగ్లాను ఖాళీ చేయాల్సి ఉంటుందని తెలిపాయి. లోక్‌సభలో ప్రశ్నలు అడిగినందుకు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలపై లోక్‌సభ నైతిక విలువ కమిటీ ఆమెను దోషిగా తేల్చిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం వెలువడింది. కమిటీ నివేదికను లోకసభ ఆమోదించడంతో డిసెంబరు 8న టీఎంసీ ఎంపీ బహిష్కరణకు గురయ్యారు. ఓ వ్యాపారవేత్త నుంచి ఆమె బహుమతులు స్వీకరించడం, అక్రమంగా లబ్ధి పొందడం పార్లమెంటరీ ప్రవర్తనను ఉల్లంఘించడమేనని నివేదికలో పేర్కొంది. బీజేపీకి చెందిన నిషికాంత్ దూబే ఫిర్యాదు మేరకు నైతిక విలువ కమిటీ విచారణ జరిపి మొయిత్రా అనైతికంగా ప్రవర్తించారని ఆరోపించింది. లోక్‌సభ వెబ్ సైట్ లాగిన్ వివరాలను అనధికార వ్యక్తులతో పంచుకున్నారని కమిటీ నివేదిక నొక్కి చెప్పింది. అయితే ఈ వివాదం జాతీయ భద్రతా చిక్కుల గురించి ఆందోళనలను లేవనెత్తింది. వ్యాపారవేత్త ప్రోద్బలంతోనే పార్లమెంటులో అదానీ గ్రూప్‌ను, ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని ప్రశ్నలు లేవనెత్తినందుకు బదులుగా మొయిత్రా బహుమతులు స్వీకరించారని దూబే ఆరోపించారు. కాగా, తన బహిష్కరణపై స్పందించిన మొయిత్రా.. లోక్‌సభ నిర్ణయం చట్టవిరుద్ధమని అన్నారు. పార్లమెంటరీ ప్యానెల్ చర్యలను ఖండిస్తూ ఆమె సోమవారం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కమిటీని అస్త్రంగా వాడుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమని ఆమె విమర్శించారు. టీఎంసీకి చెందిన మహువా మోయిత్రా పశ్చిమ బెంగాల్ లోని కృష్ణానగర్ లోక్ సభ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు.

నిర్దేశిత ప్రాంతాల్లో సమ్మెలకు అనుమతి: జేఎన్‌యూ

న్యూఢిల్లీ: జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ఆవరణలో ఆందోళనలు, నిరసనలపై పూర్తి స్థాయి నిషేధం లేదని, నిర్దేశిత ప్రాంతాల్లో వాటికి అనుమతి ఉందని అధికార యంత్రాంగం తెలిపింది. ధర్నాలు, సమ్మెలపై కఠిన ఆంక్షలు విధించడం వివాదాస్పదంగా మారడంతో ఓ అధికారి మంగళవారం ఈ మేరకు వివరణ ఇచ్చారు. తరగతి భవనాలకు 100 మీటర్లలోపు ధర్నాలు చేసినా, వాల్‌పోస్టులు అతికించినా రూ.20వేల జరిమానా విధిస్తాం లేక వర్సిటీ నుంచి బహిష్కరిస్తామని తెలిపారు. ఇవన్నీ పాత నిబంధనలేనని అన్నారు. విద్రోహ చర్యలకు పాల్పడితే రూ.10వేల జరిమానా ఉంటుందని చీఫ్ ప్రోక్టర్ కార్యాలయం (సీపీఓ) సవరిత మాన్యువల్‌లో స్పష్టంచేసినట్లు వెల్లడించారు. నిషేధిత ప్రాంతాలలో తప్ప మిగతా చోట్ల ధర్నాలు చేసుకోవచ్చన్నారు. నిషేధిత ప్రాంతాలలో సమ్మెలు చేస్తే రూ.20వేల జరిమానా విధించడం పాత పద్ధతేనని, కొత్తగా తెచ్చినది కాదని అధికారి చెప్పారు. 'మేము మార్పులేమీ చేయలేదు. ఇవన్నీ పాత నిబంధనలు. అకడమిక్ ప్రక్రియకు విఘాతం కలగరాదనే ఉద్దేశంతో కొన్ని నియమాలను కఠినతరం చేశాం. నిర్దేశిత ప్రాంతాల్లో నిరసనలు, ధర్నాలు, సమ్మెలు చేసే ప్రజాస్వామిక హక్కు విద్యార్థులకు ఇప్పుడు కూడా ఉంటుంది' అని అన్నారు. విద్రోహ చర్యలు/ వ్యతిరేక నినాదాలు చేయడం, వాల్ పోస్టర్లు అతికించడం, తరగతి భవనాలకు 100 మీటర్లలోపు ధర్నాలు చేయడంతో పాటు 28 రకాల దుష్ప్రవర్తలను మ్యానువల్‌లో ప్రముఖంగా పేర్కొన్నారు. జేఎన్‌యూ వైవిధ్య క్యాంపస్ సంస్కృతి పరిరక్షణ కోసమే నిబంధనలను కఠినతరం చేసినట్లు అధికారి వెల్లడించారు. విద్యార్థులకు ఐదు లేక అంతకంటే ఎక్కువసార్లు హెచ్చరికలు లభించి శిక్షలు పడితేగనుక వర్సిటీ నుంచి బహిష్కరించే అవకాశం ఉంటుందని, జరిమానా చెల్లించే వరకు సెమిస్టర్‌కు అనుమతించరని మ్యానువల్‌లో ఉంది.

వెంటనే ఉపసంహరించాలి: జేఎన్‌యూఎస్‌యూ డిమాండ్

నవంబరులో విడుదల చేసిన సీపీఓ సవరిత మాన్యువల్‌ను జేఎన్‌యూ విద్యార్థి సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని యంత్రాంగాన్ని డిమాండ్ చేసింది. విద్యార్థుల నిరసన హక్కును యంత్రాంగం కాలరాస్తోందని ఆరోపించింది. మ్యానువల్‌కు ఈసీ ఆమోదంతో జేఎన్‌యూఎస్‌సీ అధ్యక్షురాలు అయిషే ఘోష్‌కు రూ.10వేల జరిమానా విధించారు. మార్చి 2న టెఫ్లాస్ విద్యార్థి సంఘం కార్యాలయం తాళం పగులగొట్టి ద్వారాలు తెరిచినందుకు ఆమెపై చర్యలు తీసుకున్నారు. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకూడదని కూడా హెచ్చరించారు.

పౌరసత్వ చట్టం-సెక్షన్ 6ఏ చెల్లుబాటుపై తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: అసోంలోని అక్రమ వలసదారులకు భారత పౌరసత్వం మంజూరు చేయడానికి సంబంధించిన పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఏ రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాదులు శ్యామ్ దివాన్, కపిల్ సిబల్ తదితరుల వాదనలను నాలుగు రోజుల పాటు విన్న తర్వాత తీర్పును రిజర్వు చేసింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, ఎంఎం సుందరేష్, జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం... అసోం ఒప్పందం ప్రకారంపౌరసత్వ చట్టంలో ప్రత్యేక నిబంధనగా చేర్చబడిన సెక్షన్ 6ఏ రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైన 17 పిటిషన్లను విచారణ జరిపిన పిమ్మట తీర్పును రిజర్వు చేసింది. 1985లో సవరించిన పౌరసత్వ చట్టం ప్రకారం బంగ్లాదేశ్ సహా నిర్దేశిత భూభాగాల నుండి 1966, జనవరి 1న నుంచి మార్చి 25, 1971కి ముందు అసోంకు వచ్చిన వారు, సెక్షన్ 18 కింద భారత పౌరసత్వం పొందడం కోసం అప్పటి నుంచి ఈశాన్య రాష్ట్ర నివాసితులుగా తమను తాము నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

నీలం రాజశేఖరరెడ్డి పరిశోధన కేంద్రం
సి.ఆర్.ఫౌండేషన్, కొండాపూర్, హైదరాబాద్

నీలం రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా
"మహిళా రిజర్వేషన్ చట్టం - సాధికారత"
అంశంపై సెమినార్
తేది: 13 డిసెంబర్, 2023 సమయం: ఉ॥ 10.30 ని॥లకు
వేదిక: కామ్రేడ్ ఇంద్రజిత్ గుప్త మెమోరియల్ హాల్
సిఆర్ ఫౌండేషన్, కొండాపూర్, హైదరాబాద్.
అధ్యక్షులు
డాక్టర్ కె. పూర్ణచంద్రరావు,
డైరెక్టర్, NRRRC
ఉపన్యాసకులు
డాక్టర్ రమా మేల్కొటే
విశ్రాంత ఆచార్యులు, సామాజిక కార్యకర్త
డాక్టర్ బి.వి. విజయలక్ష్మి
మాజీ కార్యదర్శి, భారత జాతీయ మహిళా సమాఖ్య
పి.జె. చంద్రశేఖర రావు,
మాజీ ఎమ్మెల్సీ, కన్వీనర్ NRRRC

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.